
# పావురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 18-10-2024 15/-






సహజీవన భావాల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

**GEETURAI WEEKLY**

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 42 హైదరాబాద్
శుక్రవారం 18 అక్టోబర్ 2024 రూ.15-00
14 రబీ ఉస్సాని 1446 హిజ్రీ


**తొలిగీటు**

## ఆకలిగొన్న వారికి అన్నం తినిపించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




**Dual Income, No Kids (DINK)**
**డింక్ సంస్కృతి- మానవతా సంక్షోభం**
24

## లోపల...


| | | |
|---|---|---|
| అణు ఈరాన్ | ...... | 04 |
| ఎన్నికల గుణపాఠాలు | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 50 | ...... | 08 |
| చరితార్థులు–2 : మౌలానా అబ్దుర్ రహీం పోపల్‌జైయ్ | ...... | 11 |
| అవనికి వెలుగులు.. అనురాగానికి ప్రతీకలు | ...... | 12 |
| దైవప్రవక్త (స) శిక్షణా పద్ధతి | ...... | 14 |
| సమాజ కాపరి పోలీసు | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| దివ్యఖుర్ఆన్ దాని సందేశం | ...... | 21 |
| యుద్ధం ఇంకా మిగిలే ఉంది! | ...... | 28 |
| సామాజిక బాధ్యత | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| శాశ్వత గృహం స్వర్గం | ...... | 34 |


### గెలుపు సంబడం...




హరియాణ భాజపా
కశ్మీరులోన కూటమి
ఇరువురికీ చెరో చోట
తప్పలేదట ఓటమి!
ఎలాగోలా గెల్చామని
పడుతున్నరు సంబరం
తావులేదు విలువలకు
యేమిటో ఈ సంబడం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# అణు ఈరాన్

**ఈరాన్** అణుబాంబును పరీక్షించిందన్న వార్తలు ప్రపంచవ్యాప్తంగా భగ్గుమన్నాయి. ముఖ్యంగా ఇస్రాయీల్ ఉలిక్కిపడింది. ఇవి నిర్ధారిత వార్తలు కావు. అయినప్పటికీ ఇస్రాయీల్‌లో దీనిపై చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలో బలాబలాల సమీకరణాల్లో పెద్ద మార్పునకు కారణమయ్యే వార్త ఇది. ముఖ్యంగా ఇస్రాయీల్, ఈరాన్ మధ్య యుద్ధ మేఘాలు దట్టమైన నేపథ్యంలో ఈ వార్త ప్రాముఖ్యత మరింత పెరిగింది.

తాము అణ్వాయుధాలు తయారు చేయడం లేదని తమ అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాలకు సంబంధించిందని ఈరాన్ చాలా సార్లు చెప్పినప్పటికీ అమెరికా తదితర దేశాల ఆంక్షలకు గురయ్యింది. ఈరాన్ అణుబాంబు తయారు చేయవచ్చున్న అనుమానాలు చాలా కాలంగా ఉన్నాయి. ఇస్రాయీల్ అధికారికంగా అణుబాంబు కలిగిన దేశంగా ప్రకటించనప్పటికీ ఇస్రాయీల్ వద్ద అణుబాంబులున్నాయన్నది బహిరంగ రహస్యం.

ఇటీవల ఈరాన్ చేసిన క్షిపణి దాడి తర్వాత ఈరాన్‌లోని అణుస్థావరాలపై దాడి చేయాలని వ్యూహరచనలు చేస్తున్న ఇస్రాయీల్ సైన్యం తాజా వార్తలతో ఉలిక్కిపడింది. ఈరాన్ నిజంగానే అణుబాంబు తయారు చేసి ఉంటే ఈరాన్ అణు స్థావరాలపై దాడులు చేయడం వల్ల తలెత్తే తీవ్ర పరిణామాల దృష్ట్యా ఇప్పుడు ఆ ఆలోచనలు మానుకున్నట్లు వార్త.

ఈ ప్రాంతంలో ఈరాన్ అణ్వాయుధ దేశంగా మారడం ఇస్రాయీల్‌కు పీడకల వంటిది. ఇప్పటికే ఇస్రాయీల్ గర్వంగా ప్రచారం చేసుకున్న ఐరన్ డోమ్, డేవిడ్ స్లింగ్, యారో వంటి రక్షణవ్యవస్థల ప్రతిష్ఠ తుక్కుతునియలైపోయింది. ఈరాన్ క్షిపణి దాడిలో ఇస్రాయీల్ వైమానిక దళం దారుణంగా దెబ్బతిందన్న వార్తలు వచ్చాయి. మరోవైపు పాశ్చాత్యదేశాలు, అమెరికా కూడా ఇస్రాయీల్ దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పుడు మళ్ళీ ఈరాన్‌తో అణుఒప్పందం చేసుకోవాలని అమెరికా భావిస్తున్నట్లు వార్త. ఈరాన్‌పై దాడి ఆలోచనలు మానుకున్న ఇస్రాయీల్ ఇప్పుడు దౌత్యపరంగా అమెరికా ద్వారా ఈరాన్‌పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాల్లో ఉంది. మరోవైపు ఇస్రాయీల్ తో సంబంధాలు నెలకొల్పుకున్న అరబ్బు దేశాధినేతలు కూడా ఈరాన్ అణుబాంబు వార్తను జీర్ణం చేసుకోలేకపోతున్నారు.

హమాస్ గత సంవత్సరం ఇస్రాయీల్‌పై దాడి చేసి సృష్టించిన మారణహోమం వల్లనే ఇదంతా ప్రారంభమైందని చెబుతున్న వారు అంతకు ముందు నిరంతరంగా ఇస్రాయీల్ పాలస్తీనాపై కొనసాగిస్తూ వస్తున్న హత్యాకాండలను మరిచిపోతున్నారు. హమాస్ దాడి ఇస్రాయీల్ ఊహించలేదు. ఒక బలహీనమైన శత్రువు, ఇస్రాయీల్ సైనిక శక్తిని చేష్టలుడిగిపోయేలా చేయడాన్ని ప్రపంచం నివ్వెరపోయి చూసింది. హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్న ఇస్రాయీల్ పౌరులను విడిపించడానికి, హమాస్‌ను తుదముట్టించడానికి ఇస్రాయీల్ ప్రారంభించిన యుద్ధంలో అమాయకులు, పసిపిల్లలు, మహిళలు వేలాది మంది మరణించారు కాని హమాస్ శక్తి తగ్గలేదని విశ్లేషణల్లో తెలుస్తోంది. మరోవైపు హమాస్‌కు మద్దతుగా బరిలోకి దిగిన హిజ్బుల్లాపై ఇస్రాయీల్ యుద్ధం ప్రారంభించింది. లెబనాన్‌లో ఉగ్రవాద పేజర్ పేలుళ్ళకు పాల్పడింది. ఈరాన్‌లో హత్యలు చేయించింది. ప్రతిగా హూతీలు, హిజ్బుల్లా, హమాస్ దాడులు కొనసాగుతున్నాయి. హిజ్బుల్లా నేత నస్రుల్లా హత్యకు ప్రతీకారంగా ఈరాన్ చేసిన దాడిలో ఇస్రాయీల్ వైమానికదళం నష్టపోయిందన్న వార్తలు వచ్చాయి. గమనించవలసిన విషయమేమిటంటే, ఇస్రాయీల్ దాడులు గాజాలోను, లెబనాన్‌లోను కేవలం జనావాసాలపై, ఆసుపత్రులపై, స్కూళ్ళపై, మస్జిదులపై జరుగుతుంటే, ఇస్రాయీల్‌పై ఈరాన్ చేసిన దాడి కాని హిజ్బుల్లా దాడులు కాని సైనికస్థావరాలపై జరుగుతున్నాయి. ఈ వాస్తవాన్ని కూడా నిష్పక్షపాతంగా చాలా మంది విశ్లేషించారు. ఈరాన్ దాడి తర్వాత దెబ్బతిన్న ఇస్రాయీల్ అణుస్థావరాలపై దాడులు చేస్తామని చెప్పింది కాని ఇప్పుడు స్వయంగా ఈరాన్ అణుబాంబు పరీక్షించిందన్న వార్తతో మొత్తం ముఖచిత్రం మారిపోయింది. పశ్చిమాసియాలో అమెరికా దాని మిత్రదేశాల రాజకీయాలు ఆరని కుంపటిలా యుద్ధాలను రగులుస్తూనే ఉన్నాయి. రానున్న కాలంలో పశ్చిమాసియాలో మారే సమీకరణాలు ప్రపంచ రాజకీయాలను ఏ మలుపు తిప్పుతాయో వేచిచూడాలి.

అబ్దుల్ వాహెద్




హర్యానా, జమ్ము కశ్మీర్ ఎన్నికల ఫలితాలు అనూహ్యంగా వచ్చాయని చాలా మంది భావిస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను తల్లకిందులు చేశాయని అంటున్నారు. కాని కాంగ్రెస్ సంస్కృతిని, కాంగ్రెస్‌లో పీఠమేసుకు కూర్చున్న కాంగ్రెస్ వ్యతిరేక శక్తులను నిశితంగా గమనిస్తున్న వారికి ఇది ఆశ్చర్యమేమీ కాదు. రాహుల్ గాంధీ చెబుతున్న ముహబ్బత్ కి దుకాన్ మాటలకు, కాంగ్రెస్ లోని కొందరు నాయకుల చేతలకు పొంతనే లేదు.

హర్యానాలో బీజేపీ ఘనవిజయం సాధించింది. బీజేపీ విజయానికి ఈవియం కారణమని, ఎన్నికల కమీషన్ కారణమని కాంగ్రెస్ చెప్పే సాకులు నమ్మశక్యంగా లేవు. బీజేపీ విజయానికి ఈవియం కారణమని కాంగ్రెస్ చెప్పే మాటల్లో నిజాయితీ ఉందా? ఈవియం కారణమైతే కాంగ్రెస్ ఈ మాట ఎంతో కాలంగా చెబుతూనే ఉంది కదా. ఈవియంలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చేసిన పోరాటమేదైనా ఉందా? ఒకటి రెండు సార్లు నివేదనలు, విజ్ఞప్తులు చేయడం తప్ప కాంగ్రెస్ ఈవియంల గురించి ఎన్నడూ ఎలాంటి ప్రతిఘటన చేయలేదు. ఇప్పుడు ఈవియంలనే సాకు చూపించడం హాస్యాస్పదంగా ఉంది.

బీజేపీ హర్యానాలో మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. అందులోను గతంలో ఎన్నడూ లేని విధంగా మెజారిటీ సాధించింది. ఇక జమ్ము కశ్మీరులో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెసులు కలిసి పరువు కాపాడుకున్నాయి.

హర్యానా విజయం బీజేపీకి గొప్ప బలాన్నిస్తుందనడంలో సందేహం లేదు. యాంటి ఇంకుబెన్సీ ఎంత బలంగా ఉన్నా బీజేపీ విజయాలు సాధిస్తుందనే నమ్మకాన్ని ఇచ్చింది. సోషల్ ఇంజనీరింగ్, ఎన్నికల ఎత్తుగడలతో, బలమైన వ్యూహాలతో బీజేపీ విజయం సాధించి చూపించింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత దెబ్బతిన్న బీజేపీ ప్రతిష్ఠ కొంతవరకు నిలబెట్టుకుంది.

మరోవైపు జమ్ము కశ్మీరులో కూడా బీజేపీ బలం పెంచుకుంది. ముఖ్యంగా జమ్ములో బీజేపీ బలం పెరిగింది. ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఎదురైన ఎదురుగాలిని తట్టుకునేలా చేస్తున్నాయి. హర్యానా ఎన్నికల విజయం తర్వాత దేశంలో హిందువులు తమవైపే ఉన్నారని, దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారినా, ధరలు ఆకాశాన్నంటినా, నిరుద్యోగం తాండవించినా, రైతు సమస్యలపై ఆందోళనలు జరిగినా, మహిళా రెజ్లర్లపై దౌర్జన్యాలు జరిగినా ... ఎన్ని వైఫల్యాలున్నా ... దేశంలో హిందూ ఓటర్లు తమ వెంటే ఉన్నారని బీజేపీ బలంగా నమ్మడానికి హర్యానా ఎన్నికల ఫలితాలు అవసరమైన భూమికనిస్తున్నాయి.

నిజానికి కాంగ్రెసుకు, బీజేపీకి ఓట్లశాతం సమానంగానే ఉంది. దాదాపు 39 శాతం ఓట్లు రెండు పార్టీలు పొందాయి. ఆ విధంగా చూసుకుంటే బీజేపీ ఓట్ల శాతం కూడా పెరిగింది. 2019లో బీజేపీ ఓట్ల శాతం 36.5 మాత్రమే.

ఈ ఎన్నికల ఫలితాల నుంచి కాంగ్రెస్ గుణపాఠాలు నేర్చుకుంటుందా? హర్యానా రాజకీయాలన్నీ జాట్ సముదాయం చుట్టు తిరుగుతాయి. ఈ రాష్ట్రంలో దాదాపు ముఖ్యమంత్రులందరు జాట్ కులస్తులే. జాట్ సముదాయం ప్రాబల్యం మిగిలిన సముదాయాల్లో అసంతృప్తికి కారణమయ్యింది. ఈ అసంతృప్తిని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంది. బీజేపీ 2014లో మొదటిసారి హర్యానాలో అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా జాట్, జాటేతర ఓటర్లందరినీ తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేసింది. పంజాబీ హిందువులు, హర్యాన్వీ బ్రాహ్మలు, వెనుకబడిన కులాలు ఇలా వివిధ సామాజిక వర్గాలను తనవైపు

> హర్యానా ఎన్నికల విజయం తర్వాత దేశంలో హిందువులు తమవైపే ఉన్నారని, దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారినా, ధరలు ఆకాశాన్నంటినా, నిరుద్యోగం తాండవించినా, రైతు సమస్యలపై ఆందోళనలు జరిగినా, మహిళా రెజ్లర్లపై దౌర్జన్యాలు జరిగినా ... ఎన్ని వైఫల్యాలున్నా ... దేశంలో హిందూ ఓటర్లు తమ వెంటే ఉన్నారని బీజేపీ బలంగా నమ్మడానికి హర్యానా ఎన్నికల ఫలితాలు అవసరమైన భూమికనిస్తున్నాయి.

తిప్పుకునే ప్రయత్నాలు చేసింది. మార్చిలో బీజేపీ హర్యానా ముఖ్యమంత్రిని మార్చింది. మనోహర్ లాల్ ఖట్టర్ ను తొలగించి నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రి చేసింది. ఖట్టర్‌కు వ్యతిరేకంగా పేరుకున్న అసమ్మతిని ఆ విధంగా నివారించడమే కాదు, నాయబ్ సింగ్ సైని వంటి వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం వహించే నాయకుడిని ముఖ్యమంత్రి చేయడం ద్వారా బీసీలను తనవైపు తిప్పుకుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే కులగణనలు, బీసీ సంక్షేమాలేవీ ఈ ఎన్నికల్లో పనిచేయలేదు. ఎన్నికల ప్రచారంలో కూడా బీజేపీ జాటేతర ఓటర్లను నిర్లక్ష్యం చేయలేదు. వారిని తనవైపు తిప్పుకునే పూర్తి ప్రయత్నాలు చేసింది.

కాని కాంగ్రెస్ నేతలు హర్యానాలో ఏం చేశారు? మాజీ ముఖ్యమంత్రి, హర్యానాలో ప్రముఖ జాట్ నాయకుడు భూపేందర్ సింగ్ హుదాపై, ఆయన కుమారుడు దీపేందర్ సింగ్ హుదాలే హర్యానా ఎన్నికల్లో పెత్తనం వహించారు. ఈ తండ్రి కొడుకులు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో జాట్ పెత్తనం చెలాయించే ప్రభుత్వం ఏర్పడుతుందన్న అభిప్రాయం ప్రజల్లో కలిగేలా వ్యవహరించారు. పైగా ఈ తండ్రి కొడుకుల రాజకీయాలన్నీ

జాట్ల చుట్టే తిరిగాయి. జాటేతర ఓటర్లు కూడా రాష్ట్రంలో ఉన్నారన్నది మరిచిపోయినట్లున్నారు. కొందరు జాటేతర నేతలకు అవకాశమిచ్చారన్నది నిజమే, కాని జాటేతర సాధారణ ఓటర్లలో కాంగ్రెస్ నాయకులు చొచ్చుకుపోలేదు. ఆ రకంగా చూస్తే హర్యానా ఫలితాలు బీజేపీ విజయం కాదు, జాటేతర ప్రభుత్వం పట్ల ప్రజల మొగ్గుగా చూడాలి.

కాంగ్రెసులోని ముఠా కుమ్ములాటలు కూడా ఈ పరాజయానికి ముఖ్యకారణం. రాష్ట్రంలో తన పెత్తనమే చెల్లాలని భూపేందర్ హుడా భావించాడు. అనేకమంది ప్రముఖ నేతలను పక్కన పెట్టేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన 90 మంది అభ్యర్థుల్లో 70 మందిని భూపేందర్ సింగ్ హుడా ఎంపికచేసి టిక్కెట్లిచ్చారని తెలుస్తోంది. భూపేందర్ సింగ్ హుడాపై, ఆయన ఎంపిక చేసిన అభ్యర్థులపై అసమ్మతి ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ఎన్నికల ప్రచారంలో ఈ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయనే లేదు. మరోవైపు కుమారి శైలజ తానే ముఖ్యమంత్రి నంటూ చేసిన వ్యాఖ్యలు, పత్రికల వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలు కాంగ్రెస్‌లో ముఠా తగువుల పరిస్థితిని ప్రజలకు స్పష్టంగా చూపించింది. నిజానికి భూపేందర్ సింగ్ హుడా, కుమారి శైలజ వంటి నేతలే కాదు రణదీప్ సింగ్ సూర్జేవాలా వంటి వారు కూడా ఎవరికి వారే ముఖ్యమంత్రులైపోవాలన్న దుగ్దను దాచుకో లేదు. ఇవన్నీ ప్రజలు చూశారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం పెరగడానికి ముఖ్యమైన కారణాల్లో దళిత ఓట్లు కూడా కీలకమైనవి. హర్యానాలో 20 శాతం దళితులున్నారు. కుమారి శైలజ వల్ల దళిత ఓట్లన్నీ కాంగ్రెసుకు పడిపోతాయనే భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉండి పోయారు. అలాగే మరో దళిత నాయకుడు ఉదయ్ భాన్‌ను హర్యానా కాంగ్రెసు అధ్యక్షుడిగా నియమించారు. కాని హర్యానాలో టిక్కెట్ల పంపకంలో ఈ అధ్యక్షుడి మాట ఏమైనా విన్నారా? మరోవైపు కుమారి శైలజ, హుడాల మధ్య ఇంటిపోరు చూసిన దళిత ఓటర్లు కూడా కాంగ్రెసుపై నమ్మకం కోల్పోయారు. దళిత ఓటర్లను ఆకట్టుకోడానికి బీజేపీ కార్యక్రమాలు నిర్వ హించింది. కాంగ్రెసు అలాంటి పనులేవీ చేయలేదు.

కాంగ్రెస్ 2018లో ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో గెలిచింది. ఆ గెలుపుకు ముఖ్యమైన కారణం వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులందరు కలిసికట్టుగా పనిచేయడం. కాని 2023లో ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ దారుణంగా ఓడి పోయింది. దీనికి ముఖ్యమైన కారణం ముఖ్యమంత్రులై పోవా లనే ఆరాటంతో అక్కడి కాంగ్రెస్ నేతలు ఇతరులను అణిచేయ డానికి, సాఫ్ట్ హిందుత్వ ఎత్తుగడలతో ప్రచారాలు నిర్వహిం చడం. కర్నాటకలో సిద్ధరామయ్య, డి.కే.శివకుమార్‌లు కలిసి విభిన్న సామాజిక వర్గాలను ఆకట్టుకునేలా వ్యవహరించడం వల్లనే గెలుపు సాధించగలిగారు. కాని వివిధ రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు ఆయా రాష్ట్రా లను తమ జాగీర్లుగా భావిస్తూ ఎవరికి వారే ముఖ్యమంత్రులై పోవాలనే పాకులాడి కాంగ్రెస్ కొంప ముంచారు. అలాగే ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుని, ఖచ్చితమైన రాజకీయ వ్యూహంతో కాంగ్రెస్ పని చేసినప్పుడు కూడా మంచి ఫలితాలే వచ్చాయి. మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, తెలం గాణలు ఇందుకు ఉదాహరణ.

బీజేపీ వంటి పార్టీని ఎలా ఎదిరించాలో ఉత్తరప్రదేశ్ లో అఖిలేష్ యాదవ్ చేసి చూపించాడు. పార్టీలో వివిధ సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సాధించాడు. సమాజవాది పార్టీ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవలసింది చాలా ఉంది. అధికారాన్ని ఇతరులతో పంచుకోవడం ప్రజాస్వామ్యంలో తప్పనిసరి. మధ్యప్రదేశ్‌లో కమలనాథ్ పెత్తందారీ రాజకీయాలు కాంగ్రెసును నిలువునా ముంచాయి. కేవలం ఒకే కులానికి మాత్రమే రాజకీయంగా అధిక ప్రాముఖ్యమిస్తూ, మరోవైపు సామాజిక న్యాయం, బీసీ కులగణన, దళితులకు న్యాయం అని ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు నమ్మడం కష్టమవుతుంది.

అంతేకాదు, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ముఖ్య కారణం దేశంలోని మైనారిటీలు కాంగ్రెసు పక్షాన బలంగా నిలబడడం. కాని హిమాచల్ ప్రదేశ్‌లో పరిణామాలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో మతఘర్షణల వాతావరణాన్ని అదుపు చేయడంలో, మతతత్వ శక్తులను నియంత్రించడంలో వైఫల్యాలు, లేదా మతతత్వ శక్తుల పట్ల ఉదారంగా వ్యవహరించడం ఇవన్నీ అందరూ చూస్తున్నారు. కాంగ్రెసును నమ్ముకోవడమంటే మోస పోవడమే అన్న అభిప్రాయం బలపడుతోంది.

రాహుల్ గాంధీ చెబుతున్న ముహబ్బత్‌కి దుకాన్ నినాదంలో నిజాయితీ ఉంటే కాంగ్రెసులో పీఠమేసుకు కూర్చున్న మతతత్వ శక్తుల పీచమణచాలి. కుల రాజకీయాలు కొనసాగిస్తూ, అధికారం కోసం పాకులాడే వారిని నియంత్రించాలి. ✤

అధ్యాయం -18

50

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

**ఎస్.ఎమ్. మలిక్**

## 3. సిఫ్ఫీన్ పోరాటం

ఇస్లామీయ చరిత్రలో ఓ మాయని మచ్చ సిఫ్ఫీన్ పోరాటం. ఖలీఫా మహనీయ అలీ(ర), సిరియా గవర్నర్ మహనీయ ముఆవియ(ర)కు మధ్య ఏర్పడిన ఓ భేదాభిప్రాయం వల్ల నెలకొన్న దురంతం.

మూల సమస్య, అవగాహనలో ఒక చిన్న అన్వయ లోపం. ఖలీఫా మహనీయ ఉస్మాన్ (ర) అమరగతి తరువాత మహనీయ ముఆవియ (ర) కోరిక, ఖలీఫా మహనీయ ఉస్మాన్(రజి) హంతకులపైన ప్రతీకారం తీర్చుకోవాలన్నది. మహనీయ అలీ(ర) అభిప్రాయం, తొలుత బయ్త్ చేసి ఖలీఫా పాలనను బలోపేతం చేస్తే ప్రతీకారం తీర్చుకోవడం సులభతరం అవుతుంది అన్నది.

ఎట్టకేలకు జమల్ పోరు జరిగిన కొన్నాళ్ళకు అమీరుల్ మూ'మినీన్ మహనీయ అలీ(ర) కూఫా వెళ్ళి అక్కడి నుంచి జరీర్ బిన్ అబ్దుల్లా బజ్లీని మహనీయ ముఆవియ (ర) వద్దకు బయ్త్ చేసేందుకు సందేశం పంపారు. జరీర్ డెమాస్కస్ వరకు వెళ్ళి అక్కడి నుంచి తాను వచ్చిన ఉద్దేశం తెలిపారు. మహనీయ ముఆవియ ఏ సమాధానం ఇవ్వలేదు. పిమ్మట బయ్త్ చేయడానికి నిరాకరించారు. పైగా ఇలా అన్నారు, "మీ అమీర్ పీడిత ఖలీఫా హత్యలో పాల్గొన్నారు, లేదా కనీసం హంతకులకు తోడ్పాటునిచ్చారు." ఆ మాటే తిరిగి వచ్చి జరీర్ మహనీయ అలీకి తెలిపారు.

ఇక ఖలీఫా సముదాయంలో విచ్ఛిత్తిని సహించలేకపోయారు. ఇక సేనను పిలువడం తప్ప మార్గాంతరం లేకపోయింది. ఆ విధంగా విధి లేక ఆయన సేనతో బయలుదేరవలసి వచ్చింది.

మహనీయ ముఆవియ(ర) కూడా తన సేనతో సిఫ్ఫీన్ మైదానంలో ఫరాత్ నది ఒడ్డున మోహరించారు. అటు మహనీయ అలీ(ర) కూడా ఫరాత్ దాటి సిఫ్ఫీన్ మైదానంలోనే క్యాంపు వేశారు. ప్రవక్త మహనీయుల కాలంలో అతి పెద్ద సేన, 12 వేల సిపాయిలతో హునైన్ పోరులో పాల్గొన్నది. కాని ఈ మైదానంలో ఓ పక్షాన ముస్లిములు 80 వేలయితే, మరో పక్షాన మహనీయ ముఆవియ సేన అంతకన్నా ఎక్కువే. కొందరు చరిత్ర కారుల ప్రకారం, 90 వేల మంది ముస్లిములు. అంటే మొత్తం లక్షా 70 వేల మందితో కూడిన సైన్యం!

### మరో ప్రయత్నం

మహనీయ అలీ(ర), మహనీయులు బషీర్, సయీద్, షబ్స్ (రిజ్వానుల్లాహ్ అలైహిమ్ అజ్మయీన్) ని మహనీయ ముఆవియ వద్దకు బయ్త్ చేసేందుకు, పోరును మాన్పించేందుకు పంపారు. బృందం నాయకునిగా బషీర్ ఇలా బోధించారు, "ముఆవియ! ఈ ప్రపంచం తాత్కాలికమయినది. మనం దైవం సమక్షంలోకి వెళ్ళవలసి ఉంది, అక్కడ మన ఆచరణల లెక్క చూపవలసి ఉంటుంది. నేను మీకు దైవాన్ని, ఆ దినాన్ని గుర్తు చేస్తున్నాను. మీరు సముదాయంలో విభేదాలు సృష్టించకండి.

ముస్లిముల రక్తం చిందించకండి. అమీర్ (నాయకుని) విధేయతలో ఆలస్యం చేయకండి.''

మహనీయ ముఆవియ(ర), ''నీవు ఈ బోధనల్ని మహనీయ అలీకి ఎందుకు వినిపించ లేదు? నాకు ప్రతి ముస్లిమ్ ప్రాణం నా ప్రాణం కన్నా ప్రేమ పాత్రమయింది. నేను కుర్‌ఆన్‌ని మరవలేను. ఒక స్వర్గ సువార్త పొందిన ఖలీఫా, ప్రవక్త స్థానంలో ఉన్న వ్యక్తి హత్య జరిగితే ఆ దౌర్జన్యం పట్ల అడక్కుండా ఉండలేను'' అని సమాధానం ఇచ్చారు.

ఆ తరువాత మహనీయ అలీ(ర) తరఫున మహనీయులు అదీ(ర), యజీద్ బిన్ కైస్, జియాద్, షబస్ రాయబారులుగా మరోసారి మహనీయ ముఆవియ(ర) వద్దకు వెళ్ళారు. కాని ఈ రాయబారం కూడా నిష్ఫలమయింది. ఇక మూడవ రాయబారం మహనీయ ముఆవియ(ర) పక్షంగా మహనీయ అలీ(ర) వద్దకు వచ్చింది. అందులో హబీబ్ బిన్ ముస్లిమ(ర), షర్జీల్ బిన్ సమత్, మొయిన్ బిన్ యజీద్, అఖ్నస్ బిన్ షురైక, నలుగురు ఉన్నారు. వీరి మంతనాలు కూడా ఎటువంటి ప్రయోజనం చేకూర్చ లేకపోయాయి.

## అంతా నిష్ఫలం

ఉభయ పక్షాలలో తీవ్రమయిన విభేదాలు ఉన్నప్పటికీ సమ్యగ్దృష్టి గల రాయబారులు వెళ్ళి ఉన్నట్లయితే వాతావరణం కాస్త చల్ల బడేది. ఉద్రిక్తత, కోపతాపాలు కొంత తగ్గేవి. ఇరువైపుల నుంచి వచ్చిన రాయబారులు కూడా కొంతయినా సంయమనం, వివేచనలతో వ్యవహరించి ఉన్నట్లయితే, ఇరు పక్షాలలో అంగీకారం కుదిరేలా కృషి చేసి ఉన్నట్లయితే సముదాయం మీది నుంచి విపత్తు తొలిగి ఉండేదేమో!

మహనీయ అలీ(ర) తన వంతుగా సయోధ్య కుదరడానికి సకల యత్నాలు జరిపారు. మంతనాలకు ద్వారాలు తెరిచే ఉంచారు. తానే మాటి మాటికి సంప్రతింపుల తలుపులు తడుతూనే ఉన్నారు. కాని ప్రయోజనం లేకపోయింది.

ఉభయ పక్షాల సేనలు సిఫ్ఫీన్ మైదానంలో ఉంటూ నెల కడచి పోయిందేమో. సంధి ఏర్పడే సూచనలేవీ కనుచూపు మేర కానరావడం లేదు. అమీరుల్ మూ'మినీన్ ప్రకటించారు, ఇక శక్తినుపయోగించడమే మార్గమని. హిజ్రీ 37వ సంవత్సరం సఫర్ నెల మొదటి తేదీన కొన్ని దళాలు రెండు వైపుల నుంచి ముందుకు వచ్చాయి. బాణాలు విసురుకుని తిరిగిపోయాయి. ఓ వారం రోజులు ఇలాగే సాగింది.

## భీకర పోరాటం

సఫర్ 8వ తేదీ రాత్రి మహనీయ అలీ(ర) తన సేన మధ్యన ఉద్విగ్న భరితంగా ఉపన్యసించారు. ఫజ్ర్ నమాజ్ తరువాత బలమయిన దాడి చేశారు, ఆ దాడిలో సిరియా సైనిక దళం, ముఆవియ(ర) సైన్యం తొలుత తడబడింది కాని తమాయించుకుని బలంగా ఇరాక్ సేన పైన దెబ్బ తీసింది. అది వెనక్కి తగ్గ సాగింది. అది గమనించి మహనీయ అలీ(ర) సిరియా సైన్యం ఎదురుగా తానే స్వయంగా రంగంలోకి దిగారు. ఆ సందర్భంలో మహనీయ అమ్మార్ బిన్ యాసిర్(ర) అమరగతి నొందారు. ఇరాకీ దళాలు పారిపోసాగాయి.

అమీరుల్ మూ'మినీన్, ఉష్తర్ నఖయీని ఆదేశించారు, ''ఇరాకీలను పిలువు, చావు నుంచి తప్పుకోవాలని పారిపోయే వారిని మృత్యువు వదలదని చెప్పు'' అన్నారు. అతని పిలుపుపై కొందరు మాత్రం తిరిగి వచ్చి సిరియా సేనతో పోరాడారు. ఇప్పుడు ఇరాకీ సైన్యం బాగా పెరిగింది. అందరినీ తీసుకుని ఉష్తర్ సిరియనుల పైన బలంగా దాడి జరిపాడు. మహనీయ అలీ(ర) కూడా అతనికి బలగాలు పంపి తోడ్పడ్డారు. సిరియనులు బాగా ఒత్తిడికి గురయ్యారు.

## యుద్ధం మధ్య మధ్యన

సిఫ్ఫీన్ సంఘటన ముస్లిముల మధ్య సంభవించిన వింతయిన సంఘటన. నిజానికి వారంతా ముస్లిమ్ సోదరులు. యుద్ధ విరామం జరిగినప్పుడల్లా నీరు త్రాగడానికి వెళ్ళి అందరూ కలసి త్రాగేవారు. ఇటు నుంచి అటు వైపునకు, అటు నుంచి ఇటు వైపునకు గుడారాలలోకి వచ్చి పరామర్శించుకునేవారు వారు కలసి భోజనం చేసేవారు. ఒకే ధర్మాన్ని ఆశ్రయించిన వారు, అయితే ప్రతి ఒక్కరూ తాము సత్య పథాన ఉన్నామని తలచేవారు.

అమ్మార్ బిన్ యాసిర్ అమరగతినొందిన నాడు ఇరుపక్షాల వారు కలసి జనాజా నమాజ్ చేశారు. అలాగే ఓ రోజు మహనీయ అలీ(ర) మైదానంలో అమరగతి పొందిన వారు అనేక మంది ఉండటం వల్ల యుద్ధం ఆపించి తమ తమ మృతులను ఖననం చేసుకునేందుకు వీలు కావాలన్నారు. ఎదుటి పక్షం వారు అంగీకరించారు. అంతే, ఇరుపక్షాల వారు రెండు చేతుల వ్రేళ్ళ వలె కలసిపోయారు! ఆ దృశ్యం చూసి కన్నీరు పెట్టుకున్నారు కొందరు.

## ఖైదీల వ్యవహారం

పోరాటం మధ్యన లభించే ఖైదీల పట్ల అత్యుత్తమంగా వ్యవహరించే వారు సిపాయీలు. ఉన్న దానిలో మేలయినది తమ సోదరులకు పెట్టేవారు. మహనీయ అలీ(ర) వారి పట్ల మంచిగా వ్యవహరించడమే కాక వదలి పెడుతూ నాలుగు దిర్హములు ఇచ్చి మరీ పంపేవారు. ఒకసారి పదిహేను మంది ఖైదీలను తెచ్చారు, వారిలో గాయాల కారణంగా మృతిచెందిన వారికి అమీరుల్ మూ'మినీన్ స్నానం చేయించి, వస్త్రం ధరింప జేసి నమాజె జనాజా చేయించారు.

## చివరగా సిపాయిల యత్నం

ఇక చేసేది లేక వారు తమ బల్లేలపైన కుర్‌ఆన్ గ్రంథాలు కట్టి

దైవం పేరిట కేకలు వేయసాగారు, "ఈ పోరుకు ఫలితం ఏదయినా ఇరువురికీ వినాశకరమే. కుర్‌ఆన్ గ్రంథమే మన మధ్య తీర్పు చేయగలదు. ఇరాకీలు సమసిపోతే తూర్పు సరిహద్దుల్ని ఎవరు రక్షిస్తారు? సిరియనులు అంతమయితే క్రైస్తవుల ధాటిని ఎవరు తిప్పికొడతారు? పడమటి సరిహద్దులను కాపాడే వారెవరు?" ఈ కేకలకు పోరు ఆగిపోయింది. ఇద్దరు సైనికులు మధ్య వర్తులుగా ఏర్పడి దివ్య కుర్‌ఆన్ ఆధారంగా తీర్పు చేయాలని నిర్ణయించారు.

మహనీయ అలీ(ర) పక్షాన అబూ మూసా అష్‌అరీ(ర), మహనీయ ముఆవియ(ర) పక్షాన అమ్ర్ బిన్ ఆస్(ర) నియమితులయ్యారు. వారికి ఆరు నెలల గడువు ఇచ్చారు. ఈ నియామకాలు హిజ్రీ 37వ సంవత్సరం, సఫర్ నెల 13వ తేదీన జరిగాయి.

## చర్చలు, తీర్పు

ప్రత్యర్థి వర్గాల నుంచి చెరి నాలుగు వందల మంది దూమతుల్ జన్దల్ దగ్గర ఓ చోట సమావేశమయ్యారు. మధ్యవర్తుల మధ్య సంభాషణ ఇలా జరిగింది:

మహనీయ అమ్ర్ బిన్ ఆస్ (ర) మహనీయ అబూ మూసా అష్‌అరీ(ర)ని అడిగారు, "మహనీయ ఉస్మాన్ (ర) దుర్మార్గుల పీడనలో అమరగతి నొందారన్న విషయంలో మీకు గట్టి నమ్మకం ఉందా?" అని.

"నిస్సందేహంగా నమ్మకం ఉంది" అన్నారు అబూ మూసా (ర).

రెండవ ప్రశ్న, "ఆయన రక్త పరిహారానికి వారసులు ముఆవియ(ర) అని మీకు తెలుసా?"

"అవును నిజమే." అన్నారు అబూ మూసా (ర).

ఆ తరువాత అమ్ర్ బిన్ ఆస్(ర) ఇలా చెప్పసాగారు,

"దివ్య కుర్‌ఆన్‌లో దైవం, అన్యాయంగా హతులయిన వారి వారసులకు మేము అధికారం ఇచ్చాము అని అంటున్నాడు. అలాంటప్పుడు మీకు ముఆవియను ఖలీఫాగా చేయడం పట్ల అభ్యంతరం ఏమిటీ? ఖురైష్ కుటుంబంలో ఆయనకు ఉన్న స్థానం తెలిసినదే. ఇస్లామ్ ప్రారంభ దశల్లో ఆయన పాత్ర ఏదీ లేదని మీరంటే ఆయన దౌర్జన్యం పాలయి మృతులయిన ఖలీఫా వారసులని మరువకండి. అంతే కాదు, రాజకీయంగా ఆయనకు తిరుగు లేదు. యుక్తి యత్నాలలో వినుతికెక్కిన వారు. పైగా, విశ్వాసుల మాతృమూర్తి ఉమ్మె హబీబాకు ఆయన సోదరులు. దైవ సందేశహరులకు విశ్వసనీయ సహచరులు, వహీని గ్రంథస్థం చేసిన వారు."

దానికి అబూ మూసా(ర), "అమ్ర్! కాస్త దైవానికి భయపడు, ఖిలాఫత్‌కు ఇవన్నీ ప్రమాణాలు కావు. దానికి సముదాయంలోని అత్యుత్తమ వ్యక్తిని ఎన్నుకోవడం జరుగుతుంది. ఇంకా ముహాజిరులలో ప్రప్రథములు సజీవంగా ఉన్నారు. వారుండగా ముఆవియ ఎలా ఖలీఫా కాగలరూ?" అని అడిగారు. కడకు మహనీయులు అలీ లేదా ముఆవియ, ఇద్దరిని వదలి సముదాయానికి ఖలీఫాను ఎన్నుకునేందుకు వదలి పెట్టాలని సూచించారు. అది కుర్‌ఆన్ అభిమతానికి విరుద్ధమని చెప్పి మహనీయ అలీ(ర) అంగీకరించ లేదు.

ఆ తరువాతి చరిత్ర అతి దుఖదాయకమయింది. మహనీయ అలీ(ర), మహనీయ ముఆవియ(ర) మధ్య జరిగిన గాథ అతి దయనీయమయిన దృశ్యాలను చూపుతుంది. ముస్లిమ్ సముదాయం చిందువందయి పోయింది. నమ్మకద్రోహులతో, విశ్వాస ఘాతుకులతో, మార్గవిహీనులతో నిండిపోయింది. ఎల్లెడలా కల్లోలాలు, ఉపద్రవాలు పెల్లుబికాయి. సముదాయంలో నెమ్మది నశించింది. మహనీయ అలీ(ర) ఈ పరిస్థితుల ప్రభావానికి తన ఖిలాఫత్ చివరి దశలో అత్యంత ఆవేదనతో గడిపారు. కాని ఆయన చేయగలిగింది ఏమీ లేకపోయింది.

## బీటలువారిన సముదాయం

ఆ విధంగా ఆ వినాశకర పోరాటం నిలిచింది. అయితే మహనీయ ఉస్మాన్(ర)ని వధించిన వారు, సబాయీలు సంధిని ఎలా సమ్మతిస్తారు? వారు యుద్ధం కొనసాగుతూ ఉండాలనే కోరుకున్నారు. అప్పుడే ముస్లిములు అత్యధికంగా నాశనమవుతారు. ఉభయ పక్షాలూ బలహీనపడతాయి. తాము విచ్చలవిడిగా మనగలమని వారి వాంఛ. కాని సిరియనులు దివ్యకుర్‌ఆన్ ఆధారంగా సంధికి సమ్మతించగానే సబాయీలు హతాశులయ్యారు. ఇక వారికి మిగిలిన మార్గం ఒక్కటే, మహనీయ అలీ నుంచి తొలగిపోవడం. వారిని "తొలగి పోయినవారు" (ఖారిజీలు) అంటారు చరిత్రకారులు. అంటే మహనీయ అలీ(ర) చేతి మీదుగా బయ్త్ చేసి దాన్నుంచి తప్పుకున్న వారని భావం.

ఖారిజీలు "అల్ హుక్ము లిల్లాహ్"అన్న నినాదంతో వేరయి ఇరు పక్షాలకు దూరంగా సురక్షిత స్థలానికి వెళ్ళి పోయారు. ఈ హంతకులు జమల్ మైదానంలో రేకెత్తించిన ఉపద్రవాన్నే సిఫ్ఫీన్ సందర్భంలోనూ సృష్టించారు. సంధి ప్రయత్నాలన్నీ వమ్ము చేయడానికి వీలయినన్ని కుయుక్తులు అన్నీ పన్నారు. ఎందుకంటే మహనీయులు అలీ, ముఆవియ మధ్య సయోధ్య కుదిరితే మహనీయ ఉస్మాన్(ర) హత్య విషయం కూడా ఏదో తేలిపోతుంది. అది వారికి రుచించని విషయం. అందువల్ల వారు మధ్య వర్తిత్వం వల్ల మహనీయ అలీ(ర) సేనలో వేర్పాటు సృష్టించారు. వారిలో కొందరు మహనీయ అలీ(ర) ఖిలాఫత్‌ని కూడా తిరస్కరించి ఖారిజీలలో కలసి పోయారు. ఇరాకీలు కూఫా నుండి సిరియాకు బయలు దేరినప్పుడు సమైక్యంగా ఉన్న వారు సిఫ్ఫీన్ నుంచి తిరిగి వస్తూ పరస్పర విరోధులయ్యారు. దారిలో ఆగిన ప్రతి చోటా పోరాడుకుంటూనే ఉన్నారు వారు. ✤


## ‘చరితార్థులు’-2



# మౌలానా అబ్దుర్ రహీం పోపల్‌జైయ్

## (1890-1944)

60



**మాతృభూమిని** ఆంగ్లేయుల బానిసత్వం నుండి విముక్తి చేయడం మాత్రమే కాకుండా బాధిత రైతాంగం, కార్మికులను ఆర్థిక-సామాజిక దోపిడి నుండి విముక్తం చేసే లక్ష్యంతో ఉద్యమించి, సంవత్సరాల తరబడి జైలుశిక్షకు గురైన మౌలానా అబ్దుర్ రహీం పోపల్‌జైయ్ ప్రస్తుత పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో 1880లో జన్మించారు. ఆయన తండ్రి మౌలానా అబ్దుల్ హకీం పోపల్‌జైయ్, తల్లి నజీర్ బేగం. ప్రాథమిక విద్య స్థానికంగా పూర్తిచేసి సంప్రదాయక ఉన్నత విద్యను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని దేవ్‌బంద్‌లోని దారుల్ ఉలూంలో పూర్తి చేసి 1912లో పెషావర్ తిరిగి వచ్చారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు దేవ్‌బంద్‌లోని దారుల్ ఉలూం ప్రధానాచార్యులు మౌలానా మహ్మూదుల్ హసన్ మార్గదర్శకంలో ఆంగ్లేయులను పారద్రోలడానికి నడుంకట్టారు. ప్రజలను లౌకికంగా, ధార్మికంగా చైతన్యవంతుల్ని చేయడానికి పలు సంస్థలను, వ్యవస్థలను స్థాపించారు. 1919లో ఆరంభమైన ఖిలాఫత్ – సహాయనిరాకరణ ఉద్యమం, హిందూ-ముస్లింల ఐక్యతా దిశగా సాగిన కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనడం ప్రారంభించారు. రౌలత్ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న అబ్దుర్ రహీం పోపల్‌జైయ్ 1928లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. ఆ తరువాత ‘జమీఅత్-ఎ-నౌజవాన్ సర్హద్’ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ సంస్థను ‘నౌజవాన్ భారత్ సభా (సర్హద్)’ పేరుతో విప్లవ సంస్థగా మార్చి, ‘చింగారి’ అను పత్రికను ప్రారంభించారు. 1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమం సందర్భంగా పెషావర్ కేంద్రంగా 12 మంది ప్రముఖ స్వాతంత్ర్యోద్యమకారులతో ఏర్పడిన ‘యుద్ధ సమితి’లో ఆయన సభ్యులయ్యారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రముఖ సంఘటనగా నిలచిన పెషావర్‌లో జరిగిన ‘ఖిస్సాఖాని బజార్ మారణకాండ’ నేపథ్యంలో 1930 మార్చి 23న ఆంగ్ల ప్రభుత్వం తొమ్మిది ఏండ్ల జైలుశిక్ష విధించింది. గాంధీ-ఇర్విన్ ఒప్పందం వల్ల శిక్షా కాలం పూర్తి కాకుండానే విడుదలైన అబ్దుర్ రహీం 1931 ఆగస్టు 29న ఒక సంవత్సరం జైలుశిక్షకు గురికాగా ఆ శిక్షాకాలం కాస్త మూడు సంవత్సరాలు సాగింది. 1933లో జైలునుండి విడుదలయ్యాక ఆంగ్లేయ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఉల్లంఘిస్తూ ఆజ్ఞలను ధిక్కరిస్తూ, నిర్బంధాలను ఖాతరుచేయకుండా బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు, సభలు, సమావేశాలలో పాల్గొంటున్న ఆయన చర్యల పట్ల ప్రభుత్వం ఆగ్రహించింది. 1940 మే 5న ఆయనను నిర్బంధించి, విచారణ జరిపి ఐదు సంవత్సరాల జైలుశిక్షను విధించింది. ఆ శిక్షాకాలంలో సాగిన దాష్టీకాల మూలంగా అబ్దుర్ రహీం తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. 1943లో ఆయనను ఆంగ్ల ప్రభుత్వం విడుదల చేసిప్పటికి తిరిగి కోలుకోలేక పోయిన మౌలానా అబ్దుర్ రహీం పోపల్‌జైయ్ 1944 మే 31న పెషావర్‌లో చివరిశ్వాస విడిచారు. ✤




**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త

**సయ్యిద్ నశీర్ అహమ్మద్**

రూపొందించిన ఆల్బమ్ ‘చరితార్థులు’ - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం



# అవనికి వెలుగులు.. అనురాగానికి ప్రతీకలు

అర్షియా

**కూతుళ్లు ఇంటికి వెలుగులు. తల్లిదండ్రులకు అల్లాహ్ ఇచ్చిన ఆత్మీయ కానుకలు. కూతుళ్లంటే ఇంటికి కారుణ్యం, సంతోషం, శుభాలను మోసుకొచ్చే వెలుగు రేఖలు. అందుకే వారు పుట్టగానే దైవదూతలు దివి నుంచి దిగి వచ్చి దీవిస్తారు.**

బాలికలు అవనికే వెలుగులు, అనురాగానికి ప్రతీకలు, పూల కంటే సున్నితమైనవారు. బాలికలు పెరిగి పెద్దయ్యాక భార్యలుగా ఇంటికి మహారాణులు అవుతారు. బాలికలు బాలుర కంటే ఎందులోనూ తక్కువ కాదు. చందమామ లేని ఆకాశం.. కూతురు లేని ఇల్లు ఒక్కటే! అందుకే మన ఇంట్లో వెన్నెల కురిపించే ఒక కూతురు ఉండాలి. ఆడ పిల్లలు ఆడుకునే ఇల్లు సంతోషాలకు నెలవు. కూతుళ్లంటే తల్లిదండ్రుల కన్నీళ్లు తుడిచే ఆత్మీయులు. వారు ఎంతో ప్రేమగా, బాధ్యతగా తల్లిదండ్రులతో వ్యవహరిస్తారు. అలాంటి ఆడపిల్లలను ఎలా పెంచాలి? వారికి ఎలాంటి విద్యాబుద్ధులు నేర్పించాలి? ఎలాంటి వరుడికిచ్చి పెళ్లి చేయాలి? ఆమెకు ఆస్తిలో వాటా ఇవ్వాలా? తదితర అంశాల గురించి ఇస్లాం స్పష్టమైన సందేశం ఇచ్చింది.

మొదటి సంతానంగా ఆడబిడ్డ పుడితే ఆ ఇంట్లో శుభాల వర్షం కురిసినట్లేనని ఇస్లాం తెలిపింది. పవిత్ర ఖుర్ఆన్ నాలుగో అధ్యాయం పేరు 'నిసా' అంటే 'మహిళ' అని అర్థం. ఈ అధ్యాయంలో బోధనలన్నీ మహిళలకే ప్రత్యేకం. అనాథ బాలికలు, పెళ్లి కాని యువతులకు తగిన హక్కులను కల్పించింది ఇస్లాం.

యుక్త వయస్సు అమ్మాయిల పెళ్లిని వాళ్ల అనుమతితోనే చేయాలని ఇస్లాం బోధించింది. అమ్మాయి అంగీకారం లేని పెళ్లి చెల్లదని తెలిపింది. తల్లిదండ్రుల ఆస్తిలోనూ ఆడబిడ్డలకు తగిన వాటా ఇవ్వాలని ఆదేశించింది. కన్న కూతురిని ఎలా ఆదరించాలో ముహమ్మద్ ప్రవక్త (స) ఆచరణాత్మకంగా నిరూపించారు. ప్రవక్త (స) తన నలుగురు కుమార్తెలను ఎంతో ప్రేమాదరణలతో పెంచి పెద్ద చేశారు. బయటి నుంచి ఇంటికి రాగానే వారిని ముద్దాడేవారు. మగ పిల్లలు, ఆడ పిల్లలు ఇద్దరినీ సమానంగా పెంచమని బోధించారు. ఆడపిల్లల పట్ల ఎలాంటి వివక్ష చూపొద్దన్నారు. ఏదైనా వస్తువు, కానుక ఇంటికి తీసుకువస్తే ముందు ఆడపిల్లలకే ఇవ్వాలన్నారు. ఆడపిల్లలను పెంచి పోషించి వారికి సరైన విద్యాబుద్ధులు నేర్పించాలని చెప్పారు. ఆమెను మంచి వరుడికిచ్చి పెళ్లి జరిపించే తల్లిదండ్రులు స్వర్గానికి వారసులవుతారని తెలిపారు.

## ఖుర్ఆన్ లో మహిళా హక్కుల రక్షణ గురించి కొన్ని బోధనలు..

★ మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. (2:228)

## ఆస్తిలో వాటా ఇలా...

★మీ సంతానం విషయంలో అల్లాహ్ మీకు ఇలా ఆదేశిస్తు న్నాడు: ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగాలకు సమానం. ఒకవేళ (మృతునికి వారసులుగా) ఇద్దరి కంటే ఎక్కువమంది ఆడ పిల్లలు ఉంటే, వారికి మొత్తం ఆస్తిలో మూడింట రెండు భాగాలు ఇవ్వాలి. ఒకే ఆడపిల్ల వారసురాలయితే, ఆస్తిలో అర్థ భాగం ఆమెకు చెందుతుంది. మృతుడు సంతానం కలవాడయితే, అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి మొత్తం ఆస్తిలో ఆరోభాగం లభించాలి. (4:11)

ఒక మనిషి గనక సంతానం లేకుండా మరణిస్తే, అతనికి ఒక సోదరి ఉంటే, అప్పుడు ఆమె అతని ఆస్తిలో సగభాగం పొందుతుంది. సోదరి గనక సంతానం లేకుండా మరణిస్తే ఆమె సోదరుడు ఆమెకు వారసుడౌతాడు. ఒకవేళ మృతునికి (వారసులు) ఇద్దరు సోదరీమణులయితే, వారు అతని ఆస్తిలోని మూడింట రెండు భాగాలకు హక్కుదారులు అవుతారు. ఒకవేళ సోదరీసోదరులు అనేకులు ఉన్నట్లయితే, అప్పుడు స్త్రీలకు ఒక వంతు పురుషులకు రెండు వంతులు లభిస్తాయి. అల్లాహ్ మీ కొరకు తన ఆజ్ఞలను విశదపరుస్తున్నాడు– మీరు మార్గం తప్పి తిరగకుండా ఉండేందుకు. అల్లాహ్‌కు ప్రతి విషయమూ తెలుసు. *(4:176)*

## మగువలకు రక్షణ ఇలా...

ప్రవక్తా! విశ్వసించిన మహిళలకు ఇలా చెప్పు, తమ చూపులను కాపాడుకోండి అని, తమ మర్మాంగాలను రక్షించుకోండి అని, తమ అలంకరణను ప్రదర్శించవలదని – దానంతట అదే కనిపించేది తప్ప–తమ వక్షస్థలాలను ఓణీ అంచులతో కప్పుకోవా లని, వారు తమ అలంకరణను వీరి ముందు తప్ప మరెవరి ముందూ ప్రదర్శించకూడదని: భర్త, తండ్రి, భర్తల తండ్రులు, తమ కుమారులు, భర్తల కుమారులు, అన్నదమ్ములు, అన్న దమ్ముల కుమారులు, అక్కా చెల్లెళ్ల కుమారులు తమతో కలసీ మెలసీ ఉండే స్త్రీలు. తమ స్త్రీ పురుష బానిసలు, వేరే ఏ ఉద్దేశ్యమూ లేని వారి కింద పని చేసే పురుష సేవకులు. స్త్రీల గుప్త విషయాలను గురించి ఇంకా తెలియని బాలురు. తాము గుప్తంగా ఉంచిన తమ అలంకరణ ప్రజలకు తెలిసేలా వారు తమ కాళ్లను నేలపై కొడుతూ నడవరాదని కూడ వారికి చెప్పు. *(24:31)*

ప్రవక్తా! నీ భార్యలకూ, నీ కూతుళ్లకూ, విశ్వాసుల యొక్క స్త్రీలకూ తమ దుప్పట్ల కొంగులను తమపై వ్రేలాడతీసుకోమని చెప్పు; వారు గుర్తింపబడటానికీ, వేధింపబడకుండా ఉండేం దుకూ ఇది ఎంతో సముచితమైన పద్ధతి. అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. *(33:59)*

## తల్లిపాదాల చెంత స్వర్గం..

★ అతని తల్లి బలహీనతపై బలహీనతను సహించి అతనిని తన కడుపున మోసింది. అతను పాలు విడిచిపెట్టటానికి రెండు సంవత్సరాలు పట్టింది. (ఇందుకే మేము అతనికి ఇలా బోధించాము) “నాకు కృతజ్ఞుడవై ఉండు, నీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపు.” *(31:14)*

మేము మానవునికి, అతను తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగాలని ఉపదేశించాము. అతని తల్లి అతనిని ఎంతో శ్రమతో తన గర్భంలో పెట్టుకొని మోసింది ఎంతో శ్రమతోనే అతనిని కన్నది. అతనిని గర్భంలో పెట్టుకొని మోసేందుకు, అతనిచే పాలు మాన్పించేందుకు ముప్ఫై మాసాలు పట్టింది. (46:15)

★ తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది. *(మహాప్రవక్త ముహమ్మద్ (స)*

✤

# దైవప్రవక్త(స) శిక్షణా పద్ధతి

- నసీరా బేగం

**దైవప్రవక్త** ముహమ్మద్(స) తన అనుచరులకు అత్యంత వివేకంతో శిక్షణ ఇచ్చేవారు. వారి మనసును నొప్పించే ఏ మాటను ఆయన(స) మాట్లాడేవారు కాదు. వారికి కష్టాన్ని కలిగించే ఏ కార్యాన్ని ఆయన(స) చేసేవారు కాదు. ప్రేమామృత వాతావరణాన్ని ఆయన(స) వారి కోసం కల్పించేవారు. అత్యంత ప్రేమగా, గౌరవంగా మాట్లాడేవారు. వారిలోనుంచి ఎవరి బలహీనత అయినా సరే ఆయన(స) గారి దృష్టికి వస్తే అతని భావోద్వేగాలను దృష్టిలో ఉంచుకుని అవకాశం కోసం ఎదురు చూసేవారు. సరైన అవకాశం లభించగానే అతని బలహీనతను సరిదిద్దే ప్రయత్నం చేసేవారు. అదీ కేవలం అతన్ని ఒంటరిగా చెప్పేవారు కాదు. అధిక శాతం సభలో మనిషిలో ఉండే ఇలాంటి బలహీనతలను ప్రస్తావించి దానిని ఈ విధంగా సరిదిద్దుకోవచ్చనే ప్రత్యామ్నాయాలను తెలిపేవారు. దానికి సంబంధించిన ఇహపర లోక నష్టాలను, అల్లాహ్ అయిష్టతను గురించి బోధించేవారు. వాటికి సంబంధించిన ఎన్నో సంఘటనలు ఆయన(స) గారి జీవితంలో మనకు కనిపిస్తాయి.

ఒకసారి దైవప్రవక్త(స)కు కొంతమంది సహచరుల గురించి ఒక విషయం తెలిసింది. అదేమిటంటే, వారు ఆయన(స) గారి బోధనలు విని అత్యధికంగా దైవారాధనలు చేసి దైవ సంతోషానికి అర్హులు కావాలని ఆశించారు. వారు అప్పటివరకు చేస్తున్న ఆరాధనలు వారి దృష్టిలో బహు తక్కువగా అనిపించాయి. అప్పుడు వారు పరస్పరం ఇలా నిర్ణయించుకున్నారు. వారిలోని ఒకతను "నేను జీవితాంతం- నిరాఘాటంగా- ఉపవాసాలు పాటిస్తాను" అని. రెండో అతను "నేను జీవితంలో ఎప్పుడూ వివాహం చేసుకోను" అని. ఇక మూడో అతను "నేను రాత్రి పూట నిదుర పోను, రాత్రంతా దైవారాధనలో మేల్కొనే ఉంటాను" అని. ఇలా అయితే మేము పూర్తి ఏకాగ్రతతో అత్యధిక ఆరాధనలు చేసి దైవ సామీప్యాన్ని, దైవ సంతోషాన్ని చూరగొన వచ్చని వారు భావించారు.

దైవప్రవక్త(స) గారికి ఈ విషయం తెలిసినప్పుడు ఆయన ప్రజలం దరినీ ఉద్దేశించి ఇలా బోధించారు : ఏమిటీ మీలో కొందరు ఈ విధంగా నిర్ణయించుకున్నారని తెలిసింది. ఆ మాటలను ప్రస్తావించి ఆయన(స) ఇలా సెలవిచ్చారు : "మీలో నాతో పోటీ పడగలవారెవరు? నేను కొన్ని రోజులు ఉపవాసం కూడా ఉంటాను. కొన్ని రోజులు ఉపవాసాలు విరమిస్తాను కూడా. నేను రాత్రిళ్ళు నిదుర కూడా పోతాను, నమాజుల కోసం నిలబడతాను కూడా. నేను వివాహాలు చేసుకుంటాను. కనుక ఎవరైతే నా సంప్రదాయాన్ని ఇష్టపడరో వారు నాలోని వారు కారు. ఈ విధంగా ఆయన(స) వారిని సంస్కరించారు. ఇతరులకు కూడా దాని ద్వారా ధర్మం విషయంలో, ఆరాధనల విషయంలో మధ్యేమార్గాన్ని అవలంబించమని సూచించారు.

కొన్నిసార్లు అవసరమైనప్పుడు మృదువుగా, ప్రేమగా మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు కూడా అతన్ని సంస్కరించారు. ఒకసారి ఇబ్నె అబూ సలమ(ర) బాల్యంలో దైవప్రవక్త(స) గారితోపాటు

కలిసి భోజనం చేశారు. అప్పుడు అబూ సలమా(ర) పళ్ళెంలో నుంచి ఒకసారి ఒకవైపు నుంచి, మరొకసారి మరో వైపు నుంచి అంటే ఎటునుంచి పడితే అటునుంచి పద్ధతి లేకుండా అన్నం తింటున్నారు. ఇది చూసిన ఆయన(స) ప్రేమగా బాబూ! నీవు భోజనం చెయ్యటం ప్రారంభించినప్పుడు, మొట్టమొదట అల్లాహ్ పేరుతో 'బిస్మిల్లాహ్' అని ప్రారంభించాలి. ఇంకా కుడిచేత్తోనే తినాలి. ఇంకా నీ ముందు నుంచి తినాలి అని బోధించారు. (బుఖారీ)

ఇంకా కొన్నిసార్లు ఎవరైనా ఏదైనా తప్పు చేస్తూ ఉంటే దానిని ఎత్తి చూపకుండా, నోటితోనూ చెప్పకుండా కేవలం సైగలతో లేదా చేసి చూపించేవారు. ఒకసారి హజ్రత్ ఫుజల్(ర) దైవప్రవక్త (స) గారితోపాటు ఆయన(స) గారి ఒంటెపై కూర్చుని ప్రయాణిస్తున్నారు. అంతలో అక్కడకు ఒక స్త్రీ వచ్చింది. ఆయన(ర) ఆ స్త్రీని చూడసాగారు. దైవప్రవక్త(స) తన చేత్తో ఆయన(ర) గారి ముఖాన్ని పక్కకు తిప్పారు. ఈ విధంగా ఆయన(ర)కు ఈ విధంగా పరాయిస్త్రీలను చూడటం తప్పు అని తెలియజేశారు. (బుఖారీ)

కొన్నిసార్లు ఏదైనా విషయం ఆచరించి చూడటం ఉత్తమమని భావించినప్పుడు ఆయన(స) ఆచరించి, మరీ చూపించేవారు. ఒకసారి ఆయన(స) ప్రజలకు మెంబరుపై నిల్చుని నమాజు చేయించారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు : నేను ఇలా ఎందుకు చేశానంటే మీరు నన్ను అనుసరించాలని. ఇతరులకు నమాజు ఎలా చెయ్యాలో మీరు నేర్పించాలని. (బుఖారీ)

ఇంకా కొన్నిసార్లు వేటిని గురించైతే దాని ఆజ్ఞలను బోధించాలనుకుంటారో వాటిని చూపించి మరీ ఆజ్ఞలను తెలియ జేసేవారు. ఒకసారి ఆయన(స) ఒక చేతిలో బంగారాన్ని, రెండో చేతిలో పట్టును తీసుకుని ఆ రెండుచేతులను పైకి ఎత్తి ప్రజలకు చూపిస్తూ 'ఓ ప్రజలారా! ఈ రెండు వస్తువులను నా సంఘంలోని పురుషులకు నిషేధించబడ్డాయి. స్త్రీల కోసం హలాల్ (ధర్మ సమ్మతం) చేయబడ్డాయి అని సెలవిచ్చారు. ఈ విధంగా ప్రజల హృదయంలో ఈ విషయం బాగా గుర్తుండిపోయేలా బోధించారు. (అబూ దావూద్)

ఒకసారి దైవప్రవక్త(స) వద్దకు ఒక వ్యక్తి వచ్చి ఓ దైవప్రవక్తా(స)! వుజూ ఎలా చెయ్యాలి? అని అడిగారు. అప్పుడు ఆయన(స) వుజూ కోసం నీళ్ళు తెప్పించారు. వుజూ పూర్తిగా చేసి చూపించారు. ఆ తరువాత ఇలా సెలవిచ్చారు: ఎవరైనా నేను చేసి చూపించిన ఈ వుజూ విధానంలో తగ్గించినా లేదా అధికం చేసినా అతను హద్దులను అతిక్రమించినట్లు, దౌర్జన్యం చేసినట్లు అని ఈ వుజూ విధానాన్ని ఆయన(స) కేవలం నోటితో బోధించి ఉంటే, వినేవాడు ఆ విధానంలో ఎక్కువ, తక్కువ చెయ్యవచ్చు అని ఆయన(స) చేసి క్రియారూపంగా చూపించారు. (ఇబ్నెమాజా)

మరికొన్ని సార్లు ఒక విషయాన్ని దాని ఔన్నత్యాన్ని, దాని ప్రత్యేకతను, దాని విలువను, దాని నమ్మకాన్ని తెలియజేయాలనుకున్నప్పుడు దైవసాక్షిగా! అని ఆ విషయాన్ని తెలియజేసేవారు. ఒక్కొక్కసారి ఆ మాటను మూడేసి సార్లు కూడా చెప్పేవారు.

ఒకసారి ఆయన(స) ఇలా సెలవిచ్చారు : దైవసాక్షిగా! అతను విశ్వాసి కాడు. దైవసాక్షిగా అతను విశ్వాసి కాడు. దైవ సాక్షిగా అతను విశ్వాసి కాడు. ఇది విన్న ప్రజలు అతను ఎవడు ఓ దైవప్రవక్తా(స)! అని విన్నవించుకున్నారు. తరువాత ఆయన(స) ఇలా సెలవిచ్చారు : ఎవని కీడు ద్వారానైతే అతని పొరుగువాడు సురక్షితంగా ఉండడో అతను అని. (బుఖారీ)

ఒక్కొక్కసారి సమయం, సందర్భంరీత్యా, అవసరానుగుణంగా దైవప్రవక్త(స) ఆవేదనా భరితమైన ప్రసంగాలు కూడా చేసేవారు. ఆ ప్రసంగాలు విన్న ప్రజల కళ్ళ ద్వారా కన్నీళ్ళు ప్రవహించేవి. హజ్రత్ ఇర్బాజ్ బిన్ సారియ(ర) ఇలా తెలియజేశారు : ఒకసారి దైవప్రవక్త(స) ప్రసంగించారు. ఆయన(స) గారి ఆ ప్రసంగాన్ని విన్నప్పుడు మా శరీర రోమాలు నిక్కబొడుచుకునేవి. ప్రవాహంగా కన్నీళ్ళు ప్రవహించేవి. (తిర్మిజీ)

ఇంకా కొన్నిసార్లు ఆయన(స) చిన్న చిన్న మాటలు పలికేవారు. ఆ మాటల్లో సముద్రమంత అర్థం ఇమిడి ఉండేది. ఉదాహరణకు,

- ❖ ప్రయోజనాన్ని చేకూర్చే జ్ఞానమే ఉత్తమ జ్ఞానం
- ❖ పైన ఉండే చెయ్యి క్రింద ఉండే చెయ్యి కంటే ఉత్తమమైనది.
- ❖ ఉత్తమమైన జీవిత చరిత్ర దైవప్రవక్తల జీవిత చరిత్ర

హజ్రత్ జాబిర్ బిన్ సమర(ర) ఇలా తెలియజేశారు: దైవప్రవక్త(స) శుక్రవారం జుమా ప్రసంగం చేసేటప్పుడు కూడా ఎక్కువ హిత బోధలు చేసేవారు కాదు. క్లుప్తంగా కొన్ని మాటలు చెప్పేవారు. (అబూ దావూద్)

దైవప్రవక్త(స) గారి ఈ ఆచరణల ద్వారా తెలిసిన విషయమేమిటంటే ప్రజలకు హితబోధ చెయ్యటం, సన్మార్గం చూపటం తప్పనిసరియే కాని అది అత్యంత వివేకంతో చెయ్యవలసిన పని. ఇంకా ఎదుటివాని శక్తి సామర్థ్యాలనుబట్టి, సమయ సందర్భాలను చూసి క్లుప్తంగా చెయ్యాలి.




# సమాజ కాపరి పోలీసు

## (అక్టోబర్ 21 పోలీస్ అమర వీరుల సంస్మరణా దినోత్సవం సందర్భంగా...)

**సమాజం**లోని గౌరవప్రదమైన వృత్తుల్లో పోలీసు ఉద్యోగం కూడా ఒకటి. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, ఘోరాలు, విధ్వంసాలూ జరగకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ ఇది. వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పోలీసుల పాత్ర చాలా కీలకం. పోలీసులను, పోలీసు వ్యవస్థను ప్రజలు ఎంతగానో గౌరవిస్తారు. శాంతి భద్రతల పరిరక్షణలో వారు పోషిస్తున్న పాత్ర అనుపమానం. ప్రపంచమంతా గాఢనిద్రలో ఉన్నప్పుడు పోలీసులు మేల్కొని, సమాజ భద్రత, పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు. ఎండనక, వాననక, పగలనక, రేయనక అనుక్షణం శ్రమిస్తారు. తమ సంతోషాన్ని వదులుకొని ఇతరులకు సహాయ పడతారు. ఎప్పుడు ఎవరికి ఏం జరుగుతుందో తెలియదు కాబట్టి ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా సదా సేవకు సిద్ధంగా ఉంటారు. సరదాలూ సంతోషాలు చాలా తక్కువ. పిల్లా పాపలతో ఆనందంగా గడపడానికి ఎక్కువ సమయం కేటాయించలేని పరిస్థితి. బంధువులూ, స్నేహితుల ఇళ్ళల్లో జరిగే వేడుకలకు హాజరు శాతమూ అంతంత మాత్రమే. కుటుంబంతో కలిసి జరుపుకునే పండగ, పబ్బాల్లాంటి సంతోష కార్యాలను కూడా త్యజించి, ప్రజల కోసం జీవించి, ప్రజల కోసమే మరణించే పోలీసులకు, ప్రాణాలను పణంగా పెట్టి వారు చేస్తున్న త్యాగానికి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి ధర్మం. సరే.. మంచివాళ్ళు, చెడ్డవాళ్ళు అన్ని చోట్లా ఉంటారు.. పోలీసులూ దీనికి మినహాయింపుకాదు. అది వేరే విషయం. ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే, అక్టోబర్ 21 పోలీసు అమర వీరుల సంస్మరణ దినం. 1959లో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టిన రోజు. కాబట్టి. ఈ రోజును ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకుంటారు. భారత్ - చైనా సరిహద్దుల్లోని ఆక్సయ్ చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్యన ఉన్న హాట్ స్ప్రింగ్స్ (వేడి నీటిబుగ్గ) అమర జవానుల త్యాగాలకు ప్రతీక. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసు వీరులను స్మరించుకోవడం ఇక్కడి నుండే ప్రారంభమైంది. 1959 అక్టోబరు 21న డీఎస్పీ కరమ్‌సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది సభ్యుల బృందం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా, చైనా రక్షణ బలగాలు

సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో సీఆర్పీఎఫ్ దళం హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో ప్రాణాలకు తెగించి పోరాడింది. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. హాట్ స్ప్రింగ్స్ అంటే వేడి నీటి బుగ్గ అని అర్థం. కానీ భారత జవాన్ల రక్తంతో తడిచిన హాట్ స్ప్రింగ్స్ నెత్తుటి బుగ్గగా మారి ఇప్పుడు అదొక సందర్శనీయ స్థలంగా రూపు దిద్దుకుంది. ఆ రోజును పురస్కరించుకొని, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల త్యాగాలను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. విధి నిర్వహణ అనేది బాధ్యతతో కూడుకున్నది. అందునా పోలీసుల విధి నిర్వహణ మరింత బాధ్యతతో, మరింత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగులకు లాగా ఇది కొన్ని గంటలకు పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఏదన్నా ఉన్నదంటే అది పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని మనం అస్సలు ఊహించలేం. ఏ అవసరం, ఏ ఆపద వచ్చినా ముందు గుర్తుకొచ్చేది పోలీసులే, ఆశ్రయించేది వారినే. ఏ వేళయినా, ఎలాంటి పరిస్థితులయినా అన్ని వేళల్లో ముందుండేదీ వాళ్ళే. సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసుల కర్తవ్యం. అంతర్గత భద్రతను కాపాడే క్రమంలో ప్రాణాలర్పించిన పోలీసులు అనేకమంది. సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించడంలో వారికి వారే సాటి. అలాంటివారిని గౌరవించుకోవడం అందరి బాధ్యత. ఖాకీ డ్రస్ కరుకుదనం వెనుక ఉన్నది కూడా మనిషే కాబట్టి మర్యాద, గౌరవం, విలువ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నిద్రాహారాలు మాని విధులు నిర్వహించే పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్న చూపే. సమయపాలన లేని విధులు, పైఅధికారులతో తిట్లు, జనంతో ఛీత్కారాలు... ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నా ఎవరూ గుర్తించడం లేదని చాలామంది పోలీసులు వాపోతున్నారు. పోలీసులకు విశ్రాంతి కావాలనే విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే పోలీసుల విధులు విభిన్నం. వీరికి పని గంటలతో సంబంధం ఉండదు. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రతిక్షణం ఆలోచించాల్సిందే. దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఒత్తిడి (Stress) కారణంగా రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోలీస్ వ్యవస్థలో దాదాపు 80 శాతం మంది తలనొప్పి, బీపీ, మధుమేహం, మెడ, వెన్నునొప్పి ఇలా ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. హోంగార్డు, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల పరిస్థితి మరీ దారుణం. డ్యూటీకి వచ్చింది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేంత వరకు విరామం లేకుండా పనిచేయాల్సిందే. బందోబస్తుల్లో పాల్గొనేవారి పరిస్థితి సరేసరి. అనారోగ్యకర వాతావరణంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారినకూడా పడుతుంటారు. ఇన్ని సమస్యల మధ్య సమాజానికి ఇంత సేవ చేస్తున్న పోలీసులను గౌరవించడం మనందరి బాధ్యత. పోలీస్ అన్నలారా... మీ త్యాగాలకు సెల్యూట్.

## కవి కరీముల్లాకు అబ్దుల్ కలాం అవార్డు



వినుకొండకు చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు ప్రొద్దుటూరులో ఈ నెల 13న జరిగే జాతీయ మేధావుల సదస్సులో ఏపిజె అబ్దుల్ కలాం అవార్డు అందజేస్తున్నట్లు నూర్ బాషా ముస్లిం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్.కె.బాజి తెలిపారు. తెలుగు సాహిత్య రంగంలో కవిగా కరీముల్లా చేసిన రచనలు సమాజాన్ని జాగృతం చేసే విధంగా విశేష ప్రభావాన్ని కలిగించాయని తెలిపారు. సమాజంలోని పేదల, పీడితుల సమస్యలపై ఆయన కలం అక్షర సమరం సాగించిందని, ఆయన ఎన్నో పుస్తకాలు జాతీయ సమైక్యతకు, మత సామరస్యానికి కట్టుబడి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకంగా గుర్తింపు పొందాయని చెప్పారు. కరీముల్లా ఇప్పటివరకూ ఇరవై ఆరు పుస్తకాలు రాశారు. ఆయన కవిత్వం ఇంగ్లీష్, కన్నడం, హిందీ, ఉర్దూ, ఒరియా భాషల్లో అనువాదమై దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలలో పరిశోధనాంశంగానూ, పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఇప్పటికే అనేక రాష్ట్ర, జాతీయ అవార్డులు, పురస్కారాలు అందుకున్న కరీముల్లా వినుకొండ ప్రాంతానికి గర్వకారణమని పలువురు కవులు, కళాకారులు ప్రశంసించారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

## ప్రవేశిక (గత సంచిక తరువాయి)

అయిదవ విషయం, అల్లాహ్ ప్రభుసత్తా, కారుణ్యాల ఆవశ్యకత కేవలం మీ పొట్ట పోసుకోవడానికి మాత్రమే కాదు, మీకు మార్గం చూపే ఏర్పాటు చేయడానికి కూడా దాని ఆవశ్యకత తప్పనిసరిగా ఉంది. ఈ మార్గం చూపడానికే ఆయన సందేశహరుని పంపాడు, గ్రంథాన్నీ అవతరింపజేశాడు.

ఈ ప్రారంభవచనాల తరువాత అప్పుడు ముసురుకున్న కరవు వ్యవహారాన్ని చర్చకు తీసుకోవడం జరిగింది. మేము పైన పేర్కొన్నట్లు, ఈ కరవు ప్రవక్త మహనీయులు (స) అభ్యర్థన మేరకు అలుముకుంది. ఆపద దాపురిస్తే తిరస్కారుల నిక్కు బోయిన మెడలు కాస్త మెత్తబడతాయి, ఉపదేశ వచనాలు ఏమయినా ఉపకరిస్తాయన్న అభిప్రాయంతో ప్రవక్తశ్రీ (స) ఆ ప్రార్థన చేశారు. ఆ ఆశ ఆ సమయాన ఎంతో కొంత ఫలిస్తున్నట్లు గోచరించసాగింది. అప్పుడు మహా మొండి సత్య విరోధులు సయితం కాటకం మూలంగా ఎలుగెత్తి అరవసాగారు, ప్రభూ, ఈ యాతనను తప్పించావంటే మేము విశ్వాసం గైకొంటామని. దీని మీదట ఒక వైపున ప్రవక్త మహనీయుల (స)కు చెప్పడం జరిగింది, ఇటువంటి విపత్తులకు ఈ జనులు గుణపాఠం గ్రహించడం అసాధ్యం, ప్రవక్త జీవితం, ఆయన శీల స్వభావాలు, ఆయన కార్యకలాపాలు, ఆయన ప్రోక్తమయిన వచనాలు అన్నీ బట్టబయలుగా చాటి చెబుతున్నాయి, ఈయన నిస్సందేహంగా దైవసందేశహరుడే అని, అయినా ఇటువంటి ప్రవక్తను కాదని వీరు విముఖులయ్యారు, అలాంటప్పుడు ఇప్పుడు ఒక్క కరవు మటుకే వీరి ఏమరు పాటును ఎలా దూరం చేయగలుగుతుంది? మరో వైపున తిరస్కారుల్ని సంబోధించి ఇలా సెలవీయడం జరిగింది, మీరు చెప్పేది శుద్ధ అబద్ధం. ఈ విపత్తు మీ నుండి తొలగించబడినట్లయితే మీరు విశ్వసిస్తారనేది అబద్ధం. మేము ఈ విపత్తును ఇదో తొలగించివేస్తున్నాము, ఇప్పుడే తేలిపోతుంది, మీరు మీ వాగ్దానంలో ఎంత సత్యవంతులో అన్నది. మీ తలపైన మీ శాస్తి పరిభ్రమిస్తోంది. మీరొక పెద్ద దెబ్బే కావాలని కోరుకుంటున్నారు. చిన్న చిన్న దెబ్బలతో మీ బుర్ర కుదుటపడదు.

ఇదే క్రమంలో ముందుకుపోయి ఫిర్‌ఔన్, అతని జాతిని ప్రస్తావించడం జరిగింది. వారికీ ఖురైష్ తిరస్కారులకు ఎదురయిన పరీక్షే ఎదురయింది. వారి వద్దకూ ఇటువంటి ఒక గౌరవనీయుడయిన ప్రవక్తే వచ్చాడు. అతను దైవం వద్ద నుండే నియమించబడినట్లు విస్పష్టంగా వ్యక్తపరిచే ప్రస్ఫుటమయిన సూచనలు, చిహ్నాలు ఆ జనం చూసుకున్నారు. వారున్నూ చిహ్నం తరువాత చిహ్నాలు చూస్తూనే పోయారు కాని తమ మంకుపట్టును మానుకోలేదు. చివరికి వారు ఎటూ తోచక అతని ప్రాణాలు తీయడానికే సమాయత్తమయ్యారు. కాని చిరకాలానికి గుణ పాఠం గరిపేటటువంటి పరిణామాన్ని చూసుకున్నారు.

ఆ తరువాత రెండవ విషయంగా పరలోకాన్ని తీసుకోవడం జరిగింది. దీన్ని మక్కా తిరస్కారులు తీవ్రంగా నిరాకరించేవారు. వారనేదేమిటంటే మేము ఎవరినీ మరణించిన తరువాత తిరిగి బ్రతికిరాగా చూడలేదు. నీవు మరో జీవితం వాదనలో సత్యమే పలుకుతున్నట్లయితే మా తాతముత్తాతల్ని బ్రతికించి తీసుకు రా. దీనికి బదులుగా పరలోక విశ్వాసానికి రెండు ఆధార నిదర్శ నాలు క్లుప్తంగా చూపడం జరిగింది. ఒకటి, ఈ పరలోకాన్ని నిరాకరించడం సదా నైతికతకు వినాశకరంగా నిరూపిత మయింది. రెండు, ఈ విశ్వవ్యవస్థ ఎవరో ఆటలాడుకునే వాని ఆట కాదు. ఇదొక వివేకవంతమయిన వ్యవస్థ. వివేచనా పరుని ఏ పనీ వ్యర్థమయినది కాదు, ఆపైన తిరస్కారులు తమ తాతముత్తాతల్ని బ్రతికించి తీసుకురమ్మన్నదానికి ఈ సమాధానం ఇవ్వడం జరిగింది: ఈ పని ప్రతిరోజూ ప్రతి ఒక్కరి కోరిక మీద జరగదు. దీనికి అల్లాహ్ ఒక దినం నిర్ణయించాడు. అప్పుడు ఆయన మానవాళి నంతటినీ ఒకేసారి సమావేశపరు స్తాడు, తన న్యాయస్థానంలో వారి విచారణ జరుపు తాడు. ఆ సమయాన్ని గురించి ఎవరయినా చింతన చేసేమాటయితే చేసుకోవాలి, అక్కడ ఎవ్వడూ తన బలం ఆధారంగానూ తప్పించుకో లేడు, మరెవరయినా కాపాడగానూ తప్పించుకోలేడు.

అల్లాహ్ నెలకొలిపే ఈ న్యాయస్థానాన్ని ప్రస్తావిస్తూ ఇలా తెలుపడం జరిగింది. ఎవరయితే అక్కడ అపరాధ ులుగా నిర్ణయమవుతారో వారి అంతిమ పరిణామం ఏమవుతుందో, మరక్కడ సఫలత పొంది బయటపడిన వారికి ఏ బహుమానం ప్రాప్తమవుతుందో వివరించడం జరిగింది. ఆపైన, చివరగా మాట ఇలా ముగించడం జరిగింది. మీకు బోధపరచడానికి ఈ ఖుర్‌ఆన్ అతి సాధారణమయిన స్పష్టమయిన భాషలో, మీ స్వంత భాషలో అవతరింపజేయబడింది, ఇక ఇప్పటికీ మీరు బోధపరచినా అర్థం చేసుకోకపోతే దుష్పరిణామాన్నే చూడాలని పట్టుపడుతున్నట్లయితే ఇక నిరీక్షించండి, మా ప్రవక్త కూడా నిరీక్షిస్తున్నాడు, జరగవలసిందేమిటో దాని సమయాన అదే ముందుకువస్తుంది.

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

### అధ్యాయం : 30

## కందక యుద్ధం

దీనినే అహ్‌జాబ్[1] యుద్ధం అని కూడా అంటారు. కందక యుద్ధం హిజ్రీ 4వ సంవత్సరం షవ్వాల్ నెలలో జరిగిందని మూసా బిన్ ఉఖ్‌బా తెలియజేశారు.

3) హజ్రత్ అనస్(రజి) చెప్పగా తాను విన్నానని హుమైద్ తెలిపారు: అనస్ (రజి) ఇలా చెప్పారు- ప్రవక్త మహనీయులు (సఅసమ్) కందకం వైపు ఏతెంచారు. చలి తీవ్రంగా ఉన్న కాలంలో ఉదయంపూట ముహాజిర్లు కందకం త్రవ్వే పనిలో నిమగ్నులై ఉన్నారు. సేవకులచేత పని చేయించడానికి వారి వద్ద సేవకులు కూడా లేరు. వారి శ్రమను, ఆకలిని చూసి దైవప్రవక్త(స) ఇలా వేడుకున్నారు:

“అల్లాహ్! విలాసవంతమైన జీవితమంటే పరలోక జీవితమే. కనుక అన్సార్లను, ముహాజిర్లను మన్నించు.”

దీనికి జవాబుగా ప్రవక్త సహచరులు (రజి) ఇలా పలికారు :

“జిహాద్ చేస్తామని దైవప్రవక్త(స) సమక్షంలో ప్రతిజ్ఞ చేసినవారము మేము. మా బొందిలో ప్రాణమున్నంత వరకూ పోరాడతాము.”

5) అయ్‌మన్ హబ్‌షీ ఇలా వివరించారు: నేను జాబిర్ (రజి) సన్నిధికి వెళ్ళినప్పుడు ఆయన ఇలా వివరించి చెప్పారు: మేము కందక యుద్ధ సందర్భంగా కందకం త్రవ్వడంలో నిమగ్నులమై ఉన్నాము. అంతలో ఒక కఠినమైన బండరాయి బయల్పడింది. గడ్డ పలుగుతో (పారతో) అది పగులలేదు. అందువల్ల కందకం త్రవ్వడంలో అవరోధం ఏర్పడింది. ప్రవక్త ప్రియసహచరులు దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి బండరాయి పగలటం లేదని చెప్పారు. దానికి దైవప్రవక్త(స), “పదండి, నేను దిగుతున్నాను” అన్నారు.

ఆయన (స) లేచి నిలబడ్డారు. ఆ సమయంలో (ఆకలి తీవ్రత కారణంగా) ఆయన కడుపుపై రాయి కట్టబడి ఉంది. అప్పటికి మూడు రోజుల నుండి మాకు తినడానికి ఒక్క మెతుకు కూడా లభ్యమవలేదు. దైవప్రవక్త (స) ఆ స్థితిలోనే తన చేత్తో గడ్డ పలుగు పట్టుకుని బండరాయిపై ఒక దెబ్బ వేయగానే అది ఇసుక దిబ్బ మాదిరిగా కూలిపోయింది. ‘దైవప్రవక్తా! నాకు ఇంటికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వండి’ అని నేను విన్నవించుకున్నాను.

(ఇంటికి రాగానే) నా భార్యతో, ‘దైవప్రవక్త (స)ను ఆకలిగొన్న స్థితిలో చూసి ఓర్చుకోలేకపోయాను. ఇంట్లో ఏమైనా తినడానికి ఉందా?’ అని అడిగాను. దానికి ఆమె, ‘ఉంది. ఒక మేక పిల్ల కూడా ఉంది’ అని చెప్పింది. నేను మేక పిల్లను జిబహ్ చేశాను. మా ఆవిడ పిండి సిద్ధం చేసింది. తరువాత మేమిద్దరం కలిసి పొయ్యిపై మాంసం కుండ పెట్టాము. పిండి నానబెట్టాము. మాంసం ఉడుకుతుండగా నేను దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ‘దైవప్రవక్తా! భోజనానికి ఇంటికి విచ్చేయండి. కొద్దిగా భోజనం తయారయింది. ఒకరిద్దరిని కూడా తమరు

**వెంట బెట్టుకుని రావచ్చు' అని చెప్పాను. "భోజనం ఎంత ఉంది?" అని ఆయన(స) అడిగారు. నేను వివరంగా చెప్పాను. దానికి ఆయన(స) "ఓహో! ఇది చాలా ఎక్కువ. పైగా స్వాదిష్టమైన వంటకం" అంటూ, "పొయ్యి మీద ఉన్న కుండను దించకూడదనీ, కొలనులో నుంచి రొట్టెలను కూడా బయటకు తీయకూడదని నీ భార్యకు చెప్పు. నేను ఇప్పుడే వస్తున్నాను" అని సూచించారు. తరువాత తన సహచరులతో "మీరంతా నాతో రండి" అన్నారు. అన్సార్లు, ముహాజిర్ సహచరులంతా సిద్ధమయ్యారు.**

**జాబిర్(రజి) తన ఇంటికి వెళ్ళి, 'ఇప్పుడెలా?' దైవప్రవక్త(స) తన ముహాజిర్, అన్సార్ సహచరులందరినీ వెంటబెట్టుకుని వస్తున్నార'ని తన భార్యతో అన్నారు. దానికి ఆమె, 'ఆయన(స) మీతో ఏమైనా అన్నారా?' అని అడిగింది. 'అవును. అన్నారు' అని చెప్పారు జాబిర్(రజి).**

**దైవప్రవక్త(స) తన సహచరులతో, "ఇంట్లోకి రండి. కాని తొక్కిసలాట జరగకూడదు" అని సూచించారు. తరువాత దైవప్రవక్త(స) రొట్టెల్ని ముక్కలుగా చేసి, వాటిపై మాంసం ముక్కల్ని పెట్టసాగారు. పొయ్యిపైనున్న కుండపై మూకుడు ఉంది. అలాగే కొలను కూడా మూయబడి ఉంది. దైవప్రవక్త(స) తన సహచరులకు భోజనం వడ్డించసాగారు. రొట్టెలు, మాంసం తీసి వడ్డిస్తూనే ఉన్నారు. సహచర మాన్యులంతా కడుపు నిండా తిన్నారు. కడకు భోజనం మిగిలి వుంది. తరువాత ఆయన(స) జాబిర్ భార్యనుద్దేశించి, "ఈ భోజనం నువ్వూ తిను. జనులకు కానుకగా కూడా పంపు. ఎందుకంటే ప్రస్తుతం వారు ఆకలితో అలమటిస్తున్నారు"[1] అని సూచించారు.**

2-1. కందక యుద్ధం జరిగిన కాలం చాలా గడ్డుకాలం. అన్సార్, ముహాజిర్ సహచరుల ప్రయాసను చూసి దైవ ప్రవక్త(స) గుండె చలించింది. వారిని ఓదార్చడానికి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని నూరిపోయడానికి ఆయన(స) ఈ విధంగా దైవాన్ని వేడుకున్నారు. ప్రాపంచిక జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలపై ఓర్పు వహించటం ఒక విశ్వాసికి చాలా అవసరం అన్న సందేశం కూడా ఇందులో ఉంది.

5-1. పై ఉల్లేఖనంలో కందకం త్రవ్వే విషయంతోపాటు మరెన్నో అంశాలు ముందుకు వచ్చాయి. దైవప్రవక్త(స) ఆకలి తీవ్రత కారణంగా తన కడుపుకు రాయి కట్టుకోవడం వాటిలో ఒకటి.

భోజనంలో 'సమృద్ధి' (బరకత్) జరగటం ప్రవక్త(స) వారి అద్భుతాలలో ఒక అద్భుతం. ఇలాంటి అద్భుతాలు ఆయన(స) ద్వారా అనేకం జరిగాయి. హజ్రత్ జాబిర్(రజి) ప్రస్తావన కూడా హదీసులలో పదేపదే వస్తూ ఉంటుంది. ఒకసారి జాబిర్(రజి) తన తండ్రి అమరగతినొందిన తరువాత ఆయన చేసిన అప్పులను గురించి దైవప్రవక్త(స) ముందు చెప్పుకుని, దుఆ చేయమని కోరారు. అప్పుడు కూడా ఇలాంటి అద్భుతమే జరిగింది.

★ ★ ★


**చందాదారులకు విజ్ఞప్తి**


చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015**

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# దివ్య కుర్‌ఆన్ - దాని సందేశం

**- ఎస్.ఎమ్.మలిక్**

**ఇది దైవగ్రంథం.** ఇందులో ఎటువంటి సందేహం లేదు. ఇది దైవ నిష్ఠాపరులయిన వారికి మార్గదర్శక గ్రంథం. వారు అగోచర విషయాలను విశ్వసించేవారు, దైవారాధనా వ్యవస్థను స్థాపించేవారు, తమకు దైవం ప్రసాదించిన దాన్నుండి జన శ్రేయం కొరకు ఖర్చుపెట్టేవారు. నీకు (ఓ ముహమ్మద్) అవతరించిన ఈ గ్రంథాన్నీ (కుర్‌ఆన్‌ని), నీకు పూర్వం అవతరించిన దైవగ్రంథాలన్నింటినీ విశ్వసించేవారు. ఇంకా వారు పరలోకాన్నీ దృఢంగా నమ్మేవారు. ఇలాంటివారే తమ ప్రభువు (దైవం) దృష్టిలో సన్మార్గాన ఉన్నవారు. వీరే కడకు సాఫల్యం పొందేవారు. (అల్ బకర 2: 2-5)

ఇది కుర్‌ఆన్ తనను పరిచయం చేసుకున్న తొలి వచనాలు. దీన్ని కాస్త వివరంగా, స్పష్టంగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చేద్దాము. ఈ వచనాలలో ప్రకటించిన విషయాలేవో ప్రథమంగా చూద్దాము :

1. ఇది దైవగ్రంథం. మానవ రచన కాదు. దీన్ని అందజేసిన వ్యక్తి ముహమ్మద్(స) రచన అంతకన్నా కాదు.

2. ఇది మార్గబోధనా గ్రంథం. దైవాన్ని నమ్మి ఆయన పట్ల భక్తిభావంతో మెలిగేవారికి మార్గదర్శక గ్రంథం.

ఈ గ్రంథంలోనే, కుర్‌ఆన్‌లోనే మరోచోట దీన్ని ఇలా కూడా పరిచయం చేయడం జరిగింది :

ఇది మానవాళి అంతటికీ సంపూర్ణ మార్గబోధిని. దీని బోధనలు అతి స్పష్టమయినవి. ఇంకా ఇది మంచీచెడుల గీటురాయి. (అల్ బకర 2: 185)

మానవాళి అంతటికీ అంటే, కేవలం అవతరించిన చోటి ప్రజలు, అరబ్బులు, ముస్లిములు మటుకే కాదు, మానవులు ప్రపంచంలో ఎక్కడెక్కడ నివసిస్తున్నారో వారందరికీ ఇది వర్తిస్తుంది. మానవుల మధ్య ఇది ఎటువంటి వ్యత్యాసాన్ని పాటించదు.

దీని బోధనలు అతి స్పష్టమయినవి అని అంటే, దీని వచనం, శైలి, ఇందులోని విషయం- సర్వం సుబోధకమయినవి. ఇవి చిక్కులతో కూడుకున్న తాత్విక విషయాలు కావు, అతి స్పష్టమయిన బోధనలు, ప్రతి మనిషికి సునాయాసంగా బోధపడే భాష, శైలి, విషయాలు పొందుపరచిన గ్రంథం.

గీటురాయి అని అంటే ఇది మంచీ చెడులకు, సత్యాసత్యాలకు, ధర్మాధర్మాలకు, న్యాయాన్యాయాలకు సంబంధించిన ప్రామాణికత మానవాళికి అందజేస్తుందన్న మాట. ఇందులోని ప్రామాణికత ఆధారంగా మానవ జీవితానికి సంబంధించిన ఏ విషయాన్నయినా, నిగ్గు దేల్చవచ్చు, విలువ కట్టవచ్చు.

ఇవన్నీ ఈ గ్రంథం ప్రత్యేకతలు!

### వివరణ

ఇక ఈ ప్రత్యేకతల్ని ఒక్కొక్క దాన్ని క్షుణ్ణంగా స్వయంగా ఈ

గ్రంథం వెలుగులోనే అర్థం చేసుకునేందుకు ప్రయత్నిద్దాము.

1. ఇది దైవగ్రంథం. కాని ఇది మొట్టమొదటి గ్రంథం కాదు. ఇది ఏకైక గ్రంథమూ కాదు. ఇందులోనే ఉంది దీనికి పూర్వం కూడా గ్రంథాలు అవతరించాయని, దీన్ని దైవగ్రంథమని నమ్మే వారు ఆ గ్రంథాలన్నింటినీ నమ్మవలసి ఉంటుందనీను. ఇంకా ఇది క్రీ.శ. 6వ శతాబ్దిలో ప్రభవించిన ముహమ్మద్ ప్రవక్తకు అవతరించిందని. అంటే లోగడ కూడా ఆయా ప్రవక్తలకే అవతరించి ఉంటాయి మిగతా దైవగ్రంథాలు సయితం.

అంటే గ్రంథాలతోపాటు ఆయా ప్రవక్తలనూ నమ్మడం తప్పనిసరి అవుతుంది. దివ్య కుర్‌ఆన్ స్వయంగానే ప్రకటిస్తుంది :

> ప్రతి జాతికీ ఒక మార్గదర్శకుడు, సన్మార్గ బోధకుడు అంటూ ఉన్నాడు. (అర్ రాద్ 13: 7)

ఈ సన్మార్గ బోధకులు, దైవప్రవక్తలు, దైవ సందేశహరులు.

అంతేకాదు, ఇంకా దైవం పక్షాన, దివ్య కుర్‌ఆన్ ఈ విధంగా కూడా ప్రకటిస్తుంది :

> మేము, మా సందేశం అందజేయడానికి ఎప్పుడు ఏ సందేశ హరుణ్ణి పంపినా అతను తన జాతి వారి భాషలోనే సందేశాన్ని అందజేశాడు, తద్వారా వారికి అతి స్పష్టంగా విషయాన్ని బోధపరచడానికి. (ఇబ్రాహీమ్ 14: 4)

### భాషలు

ఈ వచనాల ద్వారా తెలిసే మరిన్ని విషయాలేవంటే, ప్రజలు మాటలాడే భాషలు ఏవయినా అవి నిశ్చయంగా దేవుని గుర్తింపు పొందిన భాషలే. ఫలానా భాష దేవుని భాష అని, మిగతావి కావని చెప్పడానికి వీల్లేదు. ఏ భాష వర్థిల్లడమయినా, మరే భాష సమసిపోవడమయినా దైవేచ్ఛ ప్రకారమే జరుగుతుంది.

మరో విషయమేమిటంటే, కుర్‌ఆన్‌ని విశ్వసించేవారు, ప్రపంచంలో అనేక ప్రాంతాల్లో, అనేక భాషల్లో అందజేయబడిన దైవ బోధనల్ని, ఆ బోధనల్ని చేరవేసిన ప్రవక్తల్నీ, సందేశహరుల్ని సయితం దైవ బోధనలుగా, దైవ సందేశహరులుగా నమ్మవలసి ఉంటుంది. కనీసం అనేక ప్రాంతాల్లో, అనేక భాషల్లో దేవుని సందేశం అందజేయబడిందని, దైవప్రవక్తలు ప్రభవించారని నమ్మడం తప్పనిసరి. ఆయా బోధనలు, ఆయా బోధకుల ప్రామాణిక చరిత్రలు కాలక్రమేణ భద్రంగా మనలేకపోయా యన్నది వేరే విషయం.

ఈ వచనం ప్రకారం తెలుసుకోవలసిన మరో అంశం ఏమిటంటే, ఈ దైవగ్రంథాన్ని దివ్యకుర్‌ఆన్‌ని అర్థం చేసుకోదలచినవారు, దీన్ని దైవగ్రంథంగా స్వీకరించినా, స్వీకరించకపోయినా ప్రథమంగా ఇది యావన్మానవాళికి దైవిక ప్రబోధనం అన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగవలసి ఉంటుంది.

### విశ్వసించినవారు

ఈ ప్రవచనాలు ప్రకటించే రెండవ విషయం, ఈ గ్రంథం మానవాళికి సన్మార్గ దర్శనావళి. అయితే దీని ద్వారా ఎవరయినా సన్మార్గాన్ని గ్రహించగలిగారంటే ఒక షరతు. వారు దైవాన్ని నమ్మాలి. ఆయన పట్ల భక్తిభావం కలిగి ఉండాలి.

అంటే దేవుడున్నాడని, ఆయన ఒక్కడే అని, ఆయనే ఈ జగతికి సృష్టికర్త అని, ఆయనే సృష్టి మొత్తాన్నీ అనుక్షణం తన ఆదేశాలతో నడుపుతున్నాడని, ఆయన ఆదేశానుసారమే ఈ విశ్వవ్యవస్థ నిరంతరం సక్రియగా ఉంటోందని అంగీకరించే వారికి ఈ గ్రంథం అడుగడుగునా దారి చూపుతూ ఉంటుందని భావం.

ఆ దైవమే, ఆ సృష్టికర్తయే మానవులందరి ఆరాధ్యుడని దివ్యకుర్‌ఆన్‌లో పలుచోట్ల పలు విధాలుగా స్పష్టపరచడం జరిగింది :

> మీకు ఆరాధ్యుడయినవాడు, ఆ దైవం ఒక్కడే ఆరాధ్యుడు, కృపాశీలుడు, కరుణామయుడు తప్ప మరే ఆరాధ్యుడూ లేడు. (అల్ బకర 2: 163)

ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందేవారు, సన్మార్గ బోధన గ్రహించగలిగేవారు ఎవరో, ఎలాంటి వారో కూడా సూచించడం జరిగింది-

➢ వారు దైవాన్ని చూడకుండానే విశ్వసిస్తారు, ఆయన పట్ల భయభక్తులు కలిగి మెలుగుతారు.

➢ వారు దైవ ప్రార్థనా వ్యవస్థను నెలకొలుపుతారు.

➢ తమకు దైవం ప్రసాదించిన కలిమిలోనుంచి అగత్యపరుల కొరకు తప్పక ఖర్చుపెడతారు.

➢ ముహమ్మద్(స)కు అవతరించిన ఈ గ్రంథాన్నీ, దివ్య కుర్‌ఆన్‌ని, దైవగ్రంథమని విశ్వసిస్తారు.

➢ కేవలం కుర్‌ఆన్‌ని మాత్రమే కాదు, దీనికి పూర్వం దైవం అవతరింపజేసిన సకల గ్రంథాలను సయితం దైవగ్రంథాలను, అవి ఏఏ ప్రవక్తలకు అవతరించాయో వారినందరినీ దైవ ప్రవక్తలుగా నమ్ముతారు.

➢ వారు పరలోక జీవితాన్ని, దాని గురించి కుర్‌ఆన్‌లో తెలిపిన వివరాలన్నింటితో సహా దృఢంగా నమ్ముతారు.

## మానవాళి అంతటికీ...

ఈ గ్రంథం మానవాళి అంతటికీ సన్మార్గ బోధిని అంటే ఇది మానవుల మధ్య ఏ భూమిక మీద కూడా విభేదాన్ని సహించదు. దీని దృష్టిలో, దీని బోధనల ప్రకారం మానవులెల్లరు సమానులే. అరబ్బులు అరబ్బేతరులు, నల్లవారు తెల్లవారు, ఆర్యులు, ద్రావిడులు, అందరూ ఒకే మానవ స్త్రీ పురుషుల జంట ద్వారా ఉనికిలోకి వచ్చారు కాబట్టి అందరూ సమానులే. ఈ గ్రంథ బోధన గ్రహించడానికి అందరూ అర్హులే. ఇది అందరికీ వర్తిస్తుంది, అందరూ దీని ఆవశ్యకత గలవారే.

ఈ వివరాలను బట్టి ఈ సందేశం, జాతి, భాష, ప్రాంతం, దేశం అన్నింటికీ అతీతం, అందరికీ అవసరం.

## పరలోకం

ఈ గ్రంథం ద్వారా ప్రయోజనం పొందగోరే వారి లక్షణాలలో పరలోక జీవితం పట్ల విశ్వాసమూ ఉంది. ఇది ఈ వచనాలలోని అతి ముఖ్యమయిన విషయం. కుర్‌ఆన్ ప్రకారం, మానవ జీవితం అనంతం. ఈ లోకంలో మానవ జీవితం బహు స్వల్పం. కుర్‌ఆన్ దృష్టిలో ఈ లోకం కేవలం పరీక్షా స్థలం. ఈ జీవితం కేవలం పరీక్షా వ్యవధి మాత్రమే. ఇక్కడి ఆనందం పరిమితమయినదే, బాధలూ పరిమితమయినవే. ఈ పరీక్షా పరిమితమయినదే, సుఖదుఃఖాలూ పరిమితమయినవే.

ఈ జీవితం, ఈ పరీక్షా వ్యవధి ముగుస్తుంది. ఈ పరీక్షా స్థలి, ఈ లోకం కూడా ముగుస్తుంది. ప్రపంచం అంతమవుతుంది. విశ్వ వ్యవస్థ ఛిన్నాభిన్నమయి ప్రపంచం జీవకళను కోల్పోయిన స్థితినే దివ్య కుర్‌ఆన్ ప్రళయం (కియమహ్) అని పేర్కొంటుంది. అలా ప్రస్తుత వ్యవస్థ ముగిసిన తరువాత మరో వ్యవస్థలో మరో సజీవమయిన లోకం ఏర్పరచడం జరుగుతుంది. అదే పరలోకం. పరలోకం పట్ల నమ్మకంలో ఈ వివరాలన్నీ చేరి ఉన్నాయి. ఇవన్నీ దివ్య కుర్‌ఆన్‌లోని అంశాలే.

ఇలా సరికొత్త వ్యవస్థలో ఏర్పడిన లోకంలోనే, ఈ పరలోకంలోనే అనంత జీవితం పొందిన మానవుడు గత వ్యవస్థలో పరీక్షా వ్యవధి ముగించి మృత్యువు దశ దాటిన మనిషి తిరిగి సజీవంగా తన మిగతా అనంత జీవితాన్ని కొనసాగిస్తాడు. అప్పుడే అతను తన పరీక్షా వ్యవధిలో చేసిన కార్యకలాపాల చిట్టా అంతా పరిశీలించ బడుతుంది. ఈ పరిశీలన కొరకు విశ్వ ప్రభువు ఓ న్యాయవ్యవస్థ నెలకొలుపుతాడు. అందులో మనిషి కాదనలేని ఆధారాలతో అతని జీవిత కాలం, పరీక్షా వ్యవధిలో చేసినదంతా ప్రత్యక్షంగా సినిమా రీళ్ళ వలే ముందుంచడం జరుగుతుంది. అప్పుడు, ఆ న్యాయ వ్యవస్థకు అధిపతి, విశ్వప్రభువు మానవ కార్యకలాపాల రీత్యా అతనికి శిక్షయో బహుమానమో తీర్పు జరుగుతుంది.

## స్వర్గ నరకాలు

దివ్య కుర్‌ఆన్ రీత్యా పరలోకంలో జరిగే ఈ తీర్పు ప్రకారమే స్వర్గమో లేదా నరకమో లభిస్తుంది ప్రతి వ్యక్తికి. దైవాదేశాల ప్రకారం ఈ లోకంలో జీవించినవారు, తమ పరీక్షలో నెగ్గి స్వర్గానికి అర్హులవుతారు. పరీక్షలో ఫేలయినవారు నరకయాతనలకు గురవుతారు. ఈ తీర్పులో ఏ ఒక్క వ్యక్తికీ, ఏ మాత్రం అన్యాయం జరగదు. చేసుకున్న వారికి చేసుకున్నంత తప్పక ప్రాప్తమవుతుంది. అప్పుడు ప్రతి వ్యక్తి-

> రవ్వంత మంచి చేసి ఉన్నా దాన్ని చూసుకుంటాడు. ఇంకా
> రవ్వంత చెడు చేసుకుని ఉన్నా దాన్నీ చూసుకుంటాడు.
> (అజ్ జిల్‌జాల్ 99: 7,8)

మనిషి ఇహలోక జీవితంలో చేసుకున్న ఈ మంచీ చెడుల ఆధారంగానే అతని అనంత జీవితం, శాశ్వత లోకంలో రూపుదిద్దుకుంటుంది.

- ఈ ప్రపంచం లేక ఇహలోకం అశాశ్వతమయింది. సర్వం నాశనమయ్యేదే. ప్రతిదీ- ఈ లోకంలో గోచరించే ప్రతి వస్తువూ నశ్వరమయినదే.

- పరలోకం లేదా రానున్న మరో లోకం, మరో వ్యవస్థ శాశ్వత మయినది. అక్కడి ప్రతి వస్తువూ అనంతమయినదే. కాలమూ అనంతం, జీవితమూ అనంతం, ఆనందమూ అనంతం.

స్వర్గమూ అనంతమే నరకమూ అనంతమే.

ఇదంతా దృష్టిలో ఉంచుకునే ఇస్లామీయ విద్వాంసులు, ధార్మిక పండితులు, **"ఈ ప్రపంచం పరలోకానికి పంట భూమి"** అని దివ్య కుర్‌ఆన్ బోధనలు, ప్రవక్త ప్రవచనాల వెలుగులో సూత్రీకరించారు. పంట భూమిలో కృషీవలుడు ఏ విధంగా అత్యుత్తమమయిన పంటను పండించేందుకు శ్రమ పడతాడో అదేవిధంగా మానవుడు ఈ ప్రపంచ జీవితంలో సత్కార్యా లాచరించి పరలోకం కొరకు అత్యుత్తమ ఫలితాలను సాధించేం దుకు కృషి చేయవలసిందని సూచిస్తోంది ఈ వాక్యం.

పరలోక జీవితమే నిజమయిన జీవితం.



# Dual Income, No Kids (DINK)

# డింక్ సంస్కృతి- మానవతా సంక్షోభం

**- ముహమ్మద్ షరీఫ్**

**మానవ** నాగరికత పరిణామ క్రమం అనేక మలుపులు తిరుగుతూ ముందుకు నడుస్తుంది. అనేక సిద్ధాంతాలు మానవ నాగరికత గమ్యాన్ని నిర్దేశిస్తాయి. ఆధునిక యుగంలో దైవ రాహిత్యం, భౌతిక వాదాలు కొత్త నాగరికత రూపురేఖలను నిర్మించాయి. దేవ రహిత జీవన వ్యవస్థలు సహజసిద్ధ, దైవ నిర్మిత జీవన వ్యవస్థకు ప్రతిగా మానవ జీవితాన్ని ప్రభావితం చేశాయి.

మాల్థస్, డార్విన్‌ల సిద్ధాంతాలు డెమోగ్రఫీపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. భౌతికవాదం ప్రబలి ప్రపంచంలో మానవ జీవితాన్ని భౌతిక ప్రయోజనమే పరమార్ధంగా మార్చివేశాయి. ఉపయోగితా వాదం (Utilitarianism) వ్యవహారికసత్తావాదం (Pragmatism) అనే భావనలు మానవ జీవితాన్ని ప్రభావితం చేశాయి. వాటి ఆధారంగానే ప్రభుత్వ విధానాలు రూపొందనారంభించాయి. అత్యధిక ఆనందం, అత్యధిక ప్రయోజన సూత్రాలు విద్య సహా అన్ని రంగాల్లోనూ అమలు చేయబడ్డాయి. భౌతిక ప్రయోజనం కోసం, ఆనందకర జీవనం, జీవన ప్రమాణాల పెంపుదలకు జనాభా పెరుగుదల ఆటంకంగా పరిణమించింది. కనుక తక్కువ జనాభాతో మెరుగైన, సంతృప్తికర జీవన శైలి సాధ్యమౌతుంది. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనలో ప్రగతి సాధిస్తామనే భావనలు వర్ధిల్లాయి. దాని కొరకు బర్త్ కంట్రోల్, ఫ్యామిలి ప్లానింగ్ లాంటి విధానాలు దేశ విధానాలుగా రూపొందాయి. కుటుంబ నియంత్రణ కోసం గర్భనిరోధ సాధనాల Contracepts వాడకం పెరిగింది. చైనా లాంటి దేశాలు చాలా సమర్ధవంతంగా మాత్రమే కాక క్రూరంగా ఫ్యామిలీ ప్లానింగ్‌ని అమలు చేశాయి. చైనాలో ప్రతి రోజూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్ళి ఒన్ చైల్డ్ పాలసీ అమలుకు చైతన్య పరచడం మాత్రమే కాక, వారికి సహకరించడంతో పాటుగా ఎవరైనా రెండోసారి గర్భం ధరిస్తే క్రూరంగా అబార్షన్ చేసేవారు. గర్భధారణ విషయాన్ని దాచిపెట్టి ఎనిమిదో నెల వచ్చాక ప్రభుత్వానికి తెలిసినా బలవంతంగా అబార్షన్ చేసే వారు. అదే బాటన పయనించిన ప్రపంచ దేశాలు జనాభా నియంత్రణపై ఫోకస్ పెట్టాయి. వాటి విపరిణామాలు ఇప్పుడిప్పుడే ప్రపంచం అర్థం చేసుకుంటుంది. చైనా ఒన్ చైల్డ్ పాలసీ నుండి టూ చైల్డ్ పాలసీకి వచ్చింది. నేడు త్రి చైల్డ్ పాలసీ అమలు చేస్తుంది. పిల్లలను కంటే అనేక ఇంటెన్సివ్‌లు ఇస్తామని అంటుంది.

## మానవ వనరులే అసలైన మూలధనం

అన్ని వనరుల కంటే విలువైనవి మానవ వనరులు. ఏ దేశానికైనా పౌరులే బలం. పౌరులు లేని దేశం ఎంత ప్రగతి సాధించినా ఆ ఫలాలను పొందేదెవరు? ఉదాహరణకు ఒక ధనికుల ఇంట్లో

అన్ని భౌతిక వనరులు, విలాస సామగ్రి ఉండి, వాటిని అనుభవించేందుకు కొత్త తరం లేక ఒకరిద్దరు వృద్ధులు మాత్రమే ఉంటే ఆ విలాసాలు, సంపద వలన ఒరిగేదేముంటుంది? అలాగే చైనా లాంటి దేశాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా? ఆ సాంకేతికతను, పెరిగిన ఆర్థిక వ్యవస్థ ఫలాలను పొందే ప్రజలు లేకుండా సాధించేదేమిటి? దేశమంటే డబ్బు కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని చైనాకు అవగతమయ్యే సరికి పరిస్థితి చేజారిపోయింది. మేన్ పవర్ లేక ఉత్పత్తి ప్రభావితమయ్యే పరిస్థితులు దాపురించాయి. వృద్ధ జనాభా ఉత్పత్తి రంగంలో పని చేయలేకపోతుంది. పని చేస్తూ చేస్తూ మరణించే వారి సంఖ్య పెరుగుతుంది. రోబోలు మనిషికి ప్రత్యామ్నాయం కాదని వారికి తెలిసిపోయింది. కనుకనే దిద్దుబాటు చర్యలకు దిగింది.

## డింక్ కల్చర్

సరిగ్గా ఇలాంటి మానవతా సంక్షోభాన్ని సమాజం ఎదుర్కొంటున్న సమయంలో డింక్ కల్చర్ పేరుతో మరో ఉపద్రవం వెలుగు చూసింది. ఇది నేడు భారతదేశంలో కూడా ప్రమాద ఘంటికలు మోగిస్తుంది.

డింక్ కల్చర్ అంటే డ్యూయల్ ఇన్కమ్ విత్ నో కిడ్స్ అని అర్థం. భౌతిక వాదం మనిషిని ఎంత స్వార్థ పరత్వానికైనా దిగజారుస్తుందనేందుకు ఇదే ఉదాహరణ. మనిషి తాను మనిషిననే విషయాన్ని మరచి, తన కర్తవ్యాన్ని విడిచి నేను మాత్రమే బాగుండాలి అనే స్వార్థపూరిత భావజాలంతో ప్రకృతికి వ్యతిరేకంగా చేస్తున్న సాము ఇది.

## డింక్ కల్చర్ ఎందుకు?

**ఆర్థిక స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం :** దీనర్థం ఏమిటంటే పిల్లల్ని మన ఆర్థిక స్వాతంత్ర్యానికి అడ్డుగా భావించడం. ఇంతకంటే అమానవీయత ఏముంటుంది. పిల్లలు లేకపోవడం అనేక మానసిక రుగ్మతలకు కారకమౌతుంది.

**కెరీర్‌పై దృష్టి సారించేందుకు :** పిల్లల సంరక్షణ బాధ్యతల వలన కెరీర్‌పై శ్రద్ధ చూపలేకపోవడం అనే ధోరణి వలన భవిష్యత్తుకి భయపడి, పిల్లలు కావాలని ఉన్నా బలవంతంగా పిల్లలు వద్దనుకోవడం, తదనుగుణమైన గర్భ నిరోధక సాధనాల వినియోగం లేదా శాశ్వతంగా ఆపుకోవడం. దీర్ఘకాలంలో ఇది ఏజింగ్ లాంటి తీవ్ర పరిణామాలకు కారణమవుతుంది.

**పర్యాటనలు, ప్రయాణాలు :** ప్రపంచం తిరిగి ఆనందించాలనే కోరికతో పిల్లలను వద్దనుకోవడం ఎంత దుర్మార్గం. ఇలాంటి వారిని భావితరాలు శపిస్తాయి. ఎందుకంటే భవిష్యత్తులో జనాభా సంక్షోభానికి కారణం కాబోతున్నారు.

**వ్యక్తిగత వికాసం కొరకు :** ఇది కూడా ఫక్తు స్వార్థపూరిత కారకమే. కెరీర్‌లో ప్రగతికి నైపుణ్యాల అభివృద్ధి లాంటి వాటికోసం పిల్లలను వద్దనుకోవడం దారుణమే కదా? అధునాతన జీవన శైలి, మంచి జీవన ప్రమాణాల కోసం అర్రులు చాచడం దేనికి? ఏ పరిణామాలకు దారితీస్తుందో ఊహిస్తేనే భయమేస్తుంది.

**శృంగారమయ జీవితం కోసం :** తన భాగస్వామితో ఎప్పుడూ శృంగార జీవితాస్వాదనే పరమావధిగా జీవించడం, దానికి అనువైన సౌందర్య భావనలో జీవితం గడపడం, సామాజిక బాధ్యతల నుండి పరుగెత్తడం సమాజానికి ఏ విధంగానూ మేలు కలిగించదు. ఈ శృంగార యావ కొన్నాళ్ళే. ఎందుకంటే పెరిగే వయసు మనిషి లోని శారీరక శక్తులను బలహీన పరుస్తుంది. పర్యవసానంగా వృద్ధాప్యం దాపురిస్తుంది. అప్పుడు భార్యాభర్త లిరువురూ ఎలా జీవితం గడుపుతారు? ఇద్దరిలో ఒకరు ఏదో కారణంచేత మరణిస్తే ఏమవుతుంది? అప్పుడు ఒంటరైపోయిన జీవితానికి తోడెవరు?

## భారతదేశంలో డింక్ కల్చర్

భారతదేశంలో 2019-20 నేషనల్ ఫేమిలీ హెల్త్ సర్వే ప్రకారం 15% భారతీయులు ఈ కల్చర్‌ను కోరుతున్నారు. 40% పట్టణ మహిళలు దీనిపట్ల మొగ్గుచూపుతున్నారు. 20 నుండి 24 సంవత్సరాల వయసు కలిగిన 31% భారతీయ మహిళలు పిల్లలను కలిగిలేరు. 25% భారతీయ పట్టణ జంటలు పిల్లలను కోరుకోవడం లేదు. పట్టణాలలో ముంబై, ఢిల్లీ, బెంగళూర్‌లలో ఈ డింక్ కల్చర్ పతాక స్థాయికి చేరగా, దక్షిణాదిన కేరళ, తమిళనాడులలోని పట్టణాల్లో ఈ కల్చర్ తక్కువగా ఉంది.

## ఈ సంస్కృతి వలన వచ్చే సమస్యలు

కుటుంబ విలువలు మారిపోతాయి. భావోద్వేగాలకు చోటుండదు. మితిమీరిన స్వార్థం సమాజ వ్యతిరేక వైఖరికి కారణమవుతుంది. మానవ సంబంధాలను డబ్బుతో కొలుస్తారు. విద్య, ఉపాధిపైనే శ్రద్ధ ఉంటుంది. దీనివలన భవిష్యత్ తరాల ఉనికికే ముప్పు. భారతదేశం నేడు తన మూలాలను మరచిపోయి అనేక అగచాట్లు పడుతున్న వేళ ఇది కూడా తోడైతే విలువల సంక్షోభం చుట్టుముట్టుతుంది.

ఒంటరి జీవితం అనేక మానసిక రుగ్మతలకు లోను చేసి

ఆత్మహత్యలకు దారితీస్తుందని అధ్యయనాలు చెప్తున్నాయి. మానవ జీవితంలో సంఘజీవితం అంతమై స్వార్థపరత్వం కరాళనృత్యం చేస్తుంది.

సామాజిక బాధ్యతా భావం దూరమై మనిషిలో దయ, జాలి లాంటి గుణాలు సైతం మృగ్యమైపోతాయి. పని ప్రదేశంలో మానవీయత లోపించి బాసిజం దిశగా వర్క్ కల్చర్ మారుతుంది.

మితిమీరిన స్వాతంత్ర్యం అన్ లిమిటెడ్ ఎంటర్ టైన్‌మెంట్ సంస్కృతులు అనేక విపరిణామాలకు దారితీస్తాయి. కుటుంబ వ్యవస్థ పతనమై సమాజపు ఒక ముఖ్యమైన మూలకం అదృశ్యమై పోతుంది. దంపతుల మధ్య వైరుధ్యాలొస్తే క్షణం కూడా ఆలోచించకుండా విడిపోవడం సర్వసాధారణమై పోతుంది. విడిపోయిన తర్వాత కూడా వారు మరొకరితో ఇలా పిల్లలు లేకపోవడమే కోరుకుంటే పరిస్థితులు సమాజానికి ఆరోగ్యకరం కాదు. ఒకోసారి ఇలాంటి సందర్భాలలో వివాహాల కంటే సహ జీవనానికే మొగ్గే అవకాశం ఉంది. ఒకవేళ మరింతగా మానసిక అసమతుల్యతకు లోనైతే హెూమో సెక్సువల్స్‌గా కూడా మారే అవకాశాలు కొట్టి పారేయలేనివి.

## హైదరాబాద్, విజయవాడలనూ...

హైదరాబాద్ డింక్ జనాభాలో నాలుగో పెద్ద సిటీగా ఉండగా, విజయవాడ గ్రోయింగ్ పాపులేషన్ అధికంగా ఉన్న సిటీగా ఉంది. 25 నుండి 40 సంవత్సరాల మధ్య వయసుకల ఉన్నత విద్యనభ్యసించిన ప్రొఫెషనల్స్, మూడు నుండి ఇరవై లక్షల మధ్య ఆదాయం కలిగిన ఎగువ మధ్యతరగతికి చెందిన ఎంటర్ ప్రెన్యూర్స్, ఈ కల్చర్‌ని ఫాలో అవుతున్నారు.

ఆధునిక అపార్ట్‌మెంట్లు, విపరీతమైన వినిమయ తత్వం, డైనింగ్ ఔట్, ఎంటర్‌టైన్‌మెంట్, పిక్నిక్ ట్రావెల్, లీజర్ కార్యకలాపాలు, ఫిట్‌నెస్, వెల్‌నెస్‌లపై శ్రద్ధ. సోషల్ మీడియాలో హైదరాబాద్ డింక్ మీటప్స్, విజయవాడ డింక్ మీటప్స్ పేరుతో ఫేస్‌బుక్ సమూహాలు, చైల్డ్ ఫ్రీ ఇండియా హైదరాబాద్, విజయవాడ చాప్టర్స్, కపుల్స్ సోషల్ క్లబ్స్ ద్వారా గేమింగ్, వైన్ టేస్టింగ్స్, యోగా లాంటి వెల్‌నెస్ ఈవెంట్స్, వర్క్ షాప్స్ వీరి జీవన విధానంలో భాగమయ్యాయి.

## ప్రభుత్వ గణాంకాలు :

ప్రభుత్వ గణాంకాల ప్రకారం 20% హైదరాబాదు,15% విజయవాడ జనాభాలు డింక్‌ను అనుసరిస్తున్నారు. 35% హైదరాబాదీ మహిళలు 25% విజయవాడ మహిళలు పిల్లలు లేకుండా ఉన్నారు.

## డింక్ ద్వారా పర్యావరణ సంక్షోభం

ఈ డింక్ కల్చర్ అనేక పర్యావరణ సమస్యలకు సైతం దారి తీస్తుంది. తక్కువ జనాభా, ఎక్కువ తలసరి ఆదాయం కల దేశాలు ఏవిధంగా కార్బన్ ఉద్గారాలు పెరుగుదల కారకాలవు తాయో అదే విధంగా పిల్లలు లేని జంటలు తమ అధిక ఆదాయ వనరులను యధేచ్ఛగా వినియోగించడం వలన కర్బన ఉద్గారాలు పెరిగి గ్రీన్ హౌస్ ఎఫెక్ట్‌కు, గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తాయి. విపరీతమైన ఉపయోగితావాద ధోరణితో కొనే కార్లు, గృహోపకర ణాలు, ఏసిలు తదితరాలు వాతావరణాన్ని మరింత వేడి చేసి కర్బన ఉద్గారాలను పెంచుతాయి. తరచూ ట్రిప్స్‌కి వెళ్ళడం, విలాసవంతంగా సెలవు దినాలను, వీకెండ్స్, పెద్ద పెద్ద విలాస వంతమైన విల్లాలు, ఇళ్ళు వీటి నిర్మాణానికి అధిక నీరు వృధా చేయడం, ఆ ఇంటి నిర్వహణ కోసం అధిక శక్తి వినిమయం. ఇవి కూడా పర్యావరణ సంక్షోభ కారకాలౌతున్నాయి. ఒకటికి మించిన కార్లు, అధిక ఇంధన వినియోగం, తరచూ రెస్టారెంట్ల సందర్శన, ఆహార రవాణా- ఈ విధంగా డింక్ కుటుంబాల ద్వారా విడుదలయ్యే కర్బన ఉద్గారాలు పిల్లలు కల కుటుంబాల కంటే సరాసరి పది నుండి ఇరవై శాతం అధికంగా ఉంటు న్నాయని యుసి బెర్కెలీ స్టడీ చెబుతుంది.

ఆకాశ యానం, కార్ల యాజమాన్యాల వలన 50%, ఇంటి నిర్వహణలో శక్తి వినిమయం ద్వారా 30%, ఆహార వినిమయం, రవాణా ద్వారా 25%, కన్స్యూమర్ గూడ్స్ అనగా ఎలక్ట్రానిక్ వస్తువులు, బట్టలు, విలాసవస్తువుల ద్వారా 20% కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. వీటిని నియంత్రించేలా అనేక చర్యలను పాశ్చాత్య దేశాలు అనుసరించాలని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు

జనాభా పెరుగుదల గురించి మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల దీని గురించి సైతం మాట్లాడుతున్నారు. పిల్లల్ని కనండి, తద్వారా దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. గతంలో నేనే పిల్లలు కనవద్దని చెప్పాను, ఇప్పుడు నేనే మరలా ఆలోచించి నా అభిప్రాయాన్ని మార్చుకు న్నాను. వృద్ధుల సంఖ్యను పెంచి మన దేశాన్ని ముసలి దేశంగా మార్చకండి. యువత సంఖ్య అధికంగా ఉంటేనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలం అని ప్రస్తావించారు.

దీనికితోడు స్థానిక సంస్థలలో పోటీకి గతంలో ముగ్గురు పిల్లలుంటే అర్హత ఉండేదికాదు. ఇప్పుడా నియమం తొలగించాం అని అన్నారు.

## ప్రభుత్వం ఏం చేయాలి?

చంద్రబాబు ఈ విషయంపై మాట్లాడడం మంచిదే. ఐతే మాట్లాడితేనే సరిపోతుందా? దీనికి మరికొంత ఆచరణాత్మకత కూడా జోడించాలి. దానికి ఈ క్రింది చర్యలు చేపట్టాలి:

1) వైద్య ఆరోగ్య శాఖ ద్వారా we two ours three లాంటి కాప్షన్స్‌ను మాస్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి.

2) ప్రజలు పిల్లలను కనక పోవడానికి కారణం తరుగుతున్న జీవన ప్రమాణాలుపెరుగుతున్న ధరలు. భారమైన కుటుంబ నిర్వహణ కనుక ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి, జీవన ప్రమాణాలు పెంచాలి.

3) యువతకు ఉద్యోగ కల్పన సక్రమంగా జరిగేలా చూడాలి.

4) గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. గ్రామాలను ఉపాధి కేంద్రాలుగా మలచాలి. తద్వారా పట్టణాలకు వలస పోవడం క్రమంగా తగ్గుముఖం పట్టాలి.

5) రాష్ట్ర రాజధాని కేంద్రంగా అభివృద్ధి నమూనా కాకుండా ప్రతి రెవిన్యూ డివిజనల్ కేంద్రం చుట్టూ అభివృద్ధి కేంద్రీకరించబడాలి. అక్కడ యువతకు ఉపాధి అవకాశాలు లభించాలి. స్వయం ఉపాధి కల్పించాలి.

6) కార్పొరేట్ విద్యను, వైద్యాన్ని నియంత్రించాలి. ఎందుకంటే తల్లిదండ్రుల ఆదాయంలో అధిక భాగం పిల్లల విద్యకే ఖర్చౌతుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఈ కార్పొరేట్ విద్యను చదివించలేక సంతానం వద్దనుకుంటున్నారు.

7) గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఒక కిలోమీటరు పరిధిలో ఎలాంటి ప్రైవేట్ పాఠశాల లేకుండా నిబంధనలు రూపొందించి కఠినంగా అమలు పరచాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి వరకు చదివిన పిల్లలకు పోటీ పరీక్షలలో గ్రేస్ మార్కులు కలపాలి.

8) ప్రాథమిక, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను బలోపేతం చేయాలి, నియామకాలు చేపట్టాలి.

9) ప్రభుత్వ వైద్యం, విద్యలను పీపుల్ ఫ్రెండ్లీగా రూపొందించాలి. తద్వారా పేద, మధ్య తరగతి కుటుంబీకులకు నిర్వహణా ఖర్చులు తగ్గుతాయి.

10) వివిధ కార్పొరేషన్ల ద్వారా అర్హత కలవారికి సబ్సిడీపై లోన్లు ఇచ్చి వారిని స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలి.

11) యువతను వ్యవసాయ రంగం దిశగా ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

12) పారిశ్రామికాభివృద్ధిని పెంచేలా చర్యలు తీసుకోవాలి.

13) వరకట్నం లాంటి సామాజిక దురాచారాలను రూపుమాపాలి. ఆడపిల్లల పెళ్ళిళ్ళ సందర్భంగా కట్నం, ఇతర లాంఛనాలు చెల్లించేందుకు సరిపడా ధనాన్ని సంపాదించే అవకాశాలు లేక తల్లిదండ్రులు పిల్లల్ని కనడానికి విముఖత చూపుతున్నారు.


14) డింక్ కల్చర్ విపరిణామాలను పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులకు బోధించాలి.

15) డింక్ కల్చర్‌ని ప్రమోట్ చేసే సినిమాలకు సెన్సార్ అనుమతులు నిరాకరించాలి.

ఇలాంటి చర్యలు పట్టణీకరణను క్రమంగా తగ్గిస్తాయి, తద్వారా పట్టణాలపై ఒత్తిడి తగ్గి సమతుల్యత ఏర్పడుతుంది. అంతే కాకుండా అధిక ధరలను, విద్యా వైద్యంపై ఖర్చును తగ్గించడం వలన పిల్లలను కనేలా తల్లిదండ్రులను ప్రోత్సహించవచ్చు.

డింక్ కల్చర్ దేశంలోని విలువల పతనానికి కారణ భూతమై మానవతా సంక్షోభ కారకమౌతుంది. కనుక దీనిని ఎదుర్కొ నేందుకు పూర్తి సమాజం ముందుకు రావాలి. ప్రభుత్వం, ఉపాధ్యాయులు, సివిల్ సొసైటీలు, ఎన్‌జిఓలు, వివిధ మత సంస్థలు, ప్రతి నిధులు, విద్యార్థులు దీనిపై మాట్లాడాలి, ఈ సమస్యను ఎదుర్కోవాలి.

(అక్టోబర్ 07 నాటికి హమాస్- ఇజ్రాయిల్ మధ్య యుద్ధం సంవత్సరం పూర్తైన సందర్భంగా..)



# యుద్ధం ఇంకా మిగిలే ఉంది!

డాక్టర్ మహ్మద్ హసన్

**"రాజీ అనేది చిన్నమాట. కాని ఒక జీవితకాల యుద్ధమే దాగుంటుంది" అన్నాడు ఓ తత్త్వవేత్త.** కళింగ యుద్ధం (కీ.పూ.261) అశోకుడి జీవితాన్ని మార్చివేసింది. ఆ యుద్ధం అనంతరం తన జీవిత కాలంలో అశోకుడు మళ్ళీ యుద్ధం జోలికి వెళ్ళలేదు. స్వయంగా తన కుమారుడు "మహేంద్రుడు", కుమార్తె "సంఘ మిత్రను" బౌద్ధమత ప్రచారం కోసం శ్రీలంకకు, ఇతర దేశాలకు పంపినట్లుగా చరిత్రలో చదువుకున్నాం. ఇలా చరిత్రలో జరిగిన యుద్ధాల గూర్చి చెప్పుకుంటూపోతే గొప్పగొప్ప చారిత్రక సందర్భాలను ఉటంకించాల్సి వుంటుంది. ప్రపంచవ్యాప్తంగా చెలరేగిన విప్లవాలు రాజరిక పాలనకు తెరదించి ప్రజాస్వామ్య పాలనకు బీజం వేశాయి. దీని ఫలితంగానే రాజులు, రాజ్యాలు, భూస్వాములు కాలగర్భంలో కలిశారు.

ఓ వ్యక్తో, ఓ పాలకుడో "నియంతగా" మారి ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణలకు కారకులు అవడం మనం చూశాం. హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతల వల్ల ప్రపంచ యుద్ధాలను కూడా చూశాం. ఆ తర్వాత జరిగిన శాంతి ఒప్పందాలతో ప్రపంచం మరోసారి యుద్ధం జోలికి వెళ్ళకుండా ప్రపంచ శాంతి సంస్థను (ఐక్యరాజ్య సమితి) ఏర్పాటు చేసుకొని దాని గొడుగు క్రింద చాలా దేశాలు స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించి వికాసం పొందటం కూడా మనం చూశాం.

రెండో ప్రపంచ యుద్ధం (1939-1945) అనంతరం ఏర్పడిన మేధోచర్చల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా మానవుడి "స్వేచ్ఛకు" తగిన ప్రాధాన్యత లభించినప్పటికీ, దేశాల మధ్య సిద్ధాంత పరమైన విభేదాలు, భౌగోళికమైన వివాదాలు, పాలనాపరమైన వివాదాలు, మతపరమైన వివాదాలు నేటికీ సద్దుమణగకపోగా ఫలితంగా ప్రపంచంలో నేటికీ, తరుచుగా ఏదో మూలన దేశాల మధ్య లేదా దేశంలో ప్రజలకు పాలకులకు మధ్య యుద్ధం జరుగుతూనే వుంది. అంటే నాగరికతా పరిణామ క్రమంలో మనిషి తన ఆధిపత్య భావజాలాన్ని, మత భావజాలాన్ని, సిద్ధాంతపరమైన భావజాలాన్ని ఒక ప్రాంతమైన, ఒక దేశంలోని ప్రజలపై బలవంతంగా రుద్దటం మూలంగా దేశాల మధ్య తలెత్తిన ఘర్షణ వాతావరణం క్రమంగా యుద్ధంగా "మారిన దాఖలాలు కూడా వున్నాయి. ఉదాహరణకి సెప్టెంబర్, 11, 2001 నాటి సంఘటన ద్వారా ఏకంగా అమెరికా "అల్ ఖైదా" ఉగ్రవాద సంస్థను సమూలంగా అంతం చేయడానికి యుద్ధం చేసింది. ఫలితంగా ఆ యుద్ధంలో అమెరికా గెలిచిందా అల్ ఖైదా ఓడిందా అన్న ప్రశ్నలు పక్కన పెడ్తే అమెరికా దుశ్చర్య వల్ల అఫ్ఘనిస్తాన్ నేటికీ రావణ కాష్టంలా మండుతూనే వుంది. నేటికీ అక్కడి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభించటం లేదు అంటే ఆనాటి అమెరికా దురాలోచనే అని చెప్పాలి.

ఇక మరో సంఘటన గూర్చి ప్రస్తావిస్తాను. ఇరాక్‌లో జీవ రసాయన ఆయుధాలను తయారు చేస్తున్నారన్న నెపంతో అగ్రరాజ్యమైన అమెరికా ప్రపంచ శాంతికి తను మాత్రమే కట్టుబడి వున్నట్లు ఏకంగా ఇరాక్‌పై యుద్ధం ప్రకటించి యుద్ధ నేరాలకు బాధ్యుడిగా సద్దాం హుస్సేన్‌ను ఆ దేశంలోని చట్టాల ప్రకారం ఉరి తీయించింది (డిసెంబర్ 30, 2006లో). ఓ పాలకుడిని హతమార్చినంత మాత్రాన ప్రపంచం మొత్తం శాంతి పవనాలు విరబూస్తాయని ఆశించటం అన్నది అవివేకపు ఆలోచన. అలా అయితే జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముస్సోలిని పాలన అంతం అయిన తర్వాత ప్రపంచం మొత్తం శాంతియుతంగా ఎందుకు మారలేదు అన్నది ప్రశ్న?

అదేవిధంగా ఐక్య రాజ్యసమితి స్థాపన (1945 అక్టోబర్ 24) అనంతరం ప్రపంచం మొత్తం శాంతియుత సమాజంగా ఎందుకు మారలేదనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ డెబ్బై తొమ్మిది సంవత్సరాల కాలంలో జరిగిన వివిధ దేశాల మధ్య జరిగిన యుద్ధాల్ని ఐక్యరాజ్య సమితి ఎందుకు నివారించలేకపోయిందన్నది కూడా ప్రశ్న. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం గత రెండు సంవత్సరాలుగా జరుగుతూనే వుంది. ఆ రెండు దేశాల మధ్య ఆస్తి

నష్టం, ప్రాణ నష్టం జరుగుతూనే వుంది. అదేవిధంగా గత సంవత్సరం అక్టోబర్ 7న ప్రారంభమైన హమాస్- ఇజ్రాయిల్ యుద్ధం క్రమంగా తన పరిధిని పెంచుకొని తాజాగా ఇజ్రాయిల్ తన యుద్ధాన్ని లెబనాన్ దేశానికి విస్తరించింది, ఇది పొరుగున వున్న ఇరాన్ మీదికి విస్తరించదన్న గ్యారంటీ కూడా ఏమి లేదు. గత సంవత్సర కాలంగా జరుగుతున్న యుద్ధంలో వేలాది మంది చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారు. వారెవరూ ఇజ్రాయిల్‌పై బాంబులో, క్షిపణులో ప్రయోగించిన వారు కాదు. అంటే యుద్ధంలో నష్టపోయేది ఎక్కువగా యుద్ధంతో సంబంధం లేని వారే. ఏ యుద్ధం ఎందుకు జరుగుతుందో దాని ద్వారా కలిగే లాభం ఎవరికో, నష్టం ఎవరికో ఈ పాటికే ప్రపంచ దేశాలు గమనించి ఉండవచ్చును. కానీ ఒక పక్క ఆయుధాలు విక్రయిస్తూ మరో పక్క ప్రపంచ శాంతి అంటూ నీతి వాక్యాలు వల్లె వేస్తున్న దేశాలు, ప్రపంచంపై ఆధిపత్యం కోసం స్వార్థపు ఆలోచనలు చేస్తున్నన్ని రోజులు యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. దేశాల మధ్య యుద్ధం రాజేసి ఆయుధాల ద్వారా తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆయా దేశాలకు అమ్మి బయటి ప్రపంచానికి మాత్రం శాంతి- శాంతి అంటూ అసత్యవచనాలు పలికే దేశాలతో ప్రపంచానికి ప్రమాదం పొంచి వుంది. "యుద్ధం ఇంకా మిగిలే వుంది" రాబందుల రెక్కల చప్పుడు మరు భూమిలో వినిపిస్తూనే వుంది. ఈ రోజు పశ్చిమాసియా దేశాలు కావచ్చు, ఇంకో రోజు మరో దేశం కావచ్చు యుద్ధం కౌగిట్లో నలిగి పోవడానికి. బాధితులు (సామాన్యులు) మాత్రం ఎన్ని తరాలైనా కోలుకోని దీనస్థితిలోకి నెట్టివేయబడతారు. కాలం మారుతున్న కొద్ది "యుద్ధం" దాని రూపాన్ని మార్చుకుంటుంది. గతంలో ఆధిపత్యం కోసం ప్రపంచ దేశాల మధ్య యుద్ధం జరిగితే అది ప్రస్తుతం "తీవ్రవాదం" ముసుగువేసుకొని విస్తరిస్తోంది. "యుద్ధం అనేది నీలో నీ కోసం నిన్ను మార్చుకోవడానికి జరగాలి. అప్పుడే దీని ఫలితం అద్భుతంగా ఉంటుంది".

ఈ వాక్యాలు "వ్యక్తికి", "వ్యవస్థకు" అన్వయించుకోవచ్చు. అందుకే "యుద్ధం" చేయాలనే ఆలోచన కన్నా ముందు శాంతికి (రాజీకి) ప్రయత్నిస్తే ఇంత ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగదు. భవిష్యత్తులో జరగబోయే నష్టాలను కూడా నివారించిన వారమవుతాం ఆ దిశగా పాలకులు, పాలితులు కూడా ఆలోచిస్తారని ఆశిద్దాం.

# ముహమ్మద్(స) జీవితం సర్వమానవాళికీ ఆదర్శం :

## జమాఅతె ఇస్లామీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్




**జమాఅతె ఇస్లామీ హింద్** నంద్యాల శాఖ ఆధ్వర్యంలో స్థానిక వీసి కాలనీ, నూరాని మస్జిద్ ప్రాంగణంలో సీరత్ వేడుకలో భాగంగా "మానవ మహోపకారి ముహమ్మద్ (స)" అన్న అంశంపై గొప్ప బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య వక్తగా పాల్గొన్న జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పీ రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ రఫీఖ్ మాట్లాడుతూ, ప్రవక్త ముహమ్మద్(స) జీవితంలోని ప్రతి కోణంలో గొప్ప ఆదర్శం ఉందని సోదాహరణలతో వివరించారు. బాల్యం నుండి ఉన్నత నడవడిక అలవరుచుకొని ఇస్లాం బద్ధవిరోధులతో సైతం విశ్వసనీయుడు, సత్యవంతుడు అని కొనియాడబడిన ఉత్తముడు ప్రవక్త ముహమ్మద్(స) అని రఫీఖ్ స్పష్టపరిచారు. నేటి ఆర్థిక, సామాజిక, రాజకీయ రుగ్మతలకు పరిష్కార మార్గాలు ఆయన చూపించారని చెప్పారు. జేఐహెచ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ కరీముద్దీన్ ప్రసంగిస్తూ నిరాడంబరత, ఉత్తమ నడవడికతో అంధకారంలో, అజ్ఞానంతో, అహంకారంతో దారి తప్పిన సమాజానికి ఉత్తమ సమాజంగా తీర్చిదిద్దిన గొప్ప మానవతా వాది ప్రవక్త ముహమ్మద్(స) అన్నారు. నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు, జిల్లా బ్రాహ్మణ సమాజం అధ్యక్షులు రావినూతల దుర్గా ప్రసాద్, ప్రముఖ న్యాయవాది, బలిజ సంఘం మాజీ రాష్ట్ర డైరెక్టర్ వి. రామచంద్రారావు, క్రిష్టియన్ ఏపి, టిఎస్ జేఏసీ కన్వీనర్ ఫాస్టర్ మన్నెం జానయ్య, ఫాస్టర్ ప్రభు నైవేద్యం తమ సందేశంలో ప్రవక్త ముహమ్మద్ జీవితం ఆదర్శం అన్నారు. ముస్లిం జేఏసి అధ్యక్షులు ముహమ్మద్ అబులైస్, జేఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి యాసీర్ అహమ్మద్, ఎస్.ఎం.సుభాన్, నూరాని మస్జిద్ కమిటీ అధ్యక్షులు సలాం ఖాన్, జిల్లా బాధ్యులు సీయం జకరియా అనేక మంది ప్రముఖులు, పెద్దసంఖ్యలో స్త్రీ, పురుషులు పాల్గొన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు అబ్దుల్ సమద్ అతిథులకు స్వాగతం పలుకగా, సయ్యద్ జమీలుద్దీన్ కన్వీనర్‌గా వ్యవహరించారు. అతిథులకు ముహమ్మద్ రఫీఖ్ చేతులు మీదుగా "మానవ మహోపకారి ముహమ్మద్ (స)" పుస్తకాలు బహుకరించారు.

**– షేక్ అబ్దుల్ సమద్**

# సామాజిక బాధ్యత



(అక్టోబరు 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా...)

అయ్యూబ్ బాషా, నంద్యాల

రాత్రి 11.30 గంటలకు అత్యవసర కేసు చూసుకుని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ సుభాష్ తన కారులో హైవే రోడ్డు మీద ప్రయాణిస్తున్నారు. కారు చక్రాలు ఎంత వేగంగా పరిగెడుతున్నాయో అంతకంటే వేగంగా ఆయన ఆలోచనలలో మునిగిపోయాడు. గతంలోకి వెళ్ళిపోయాడు.

❖❖❖

సుభాష్ తమ్ముడు ఏడవ తరగతి చదువుతున్నాడు. తను ఇంటర్‌లో ఉన్నాడు. ఎప్పుడూ చదువులో ముందు ఉండేవాడు. కల్మషం లేని మనస్తత్వం అతని సొంతం. ఇరుగు పొరుగు వారితో కలివిడిగా ఉంటూ వీధిలో వారందరికీ తలలో నాలుక అయిపోయాడు. వీరికి 2 ఎకరాల పొలం ఉంది. తండ్రి వ్యవసాయం చేస్తాడు. అది రబీ సీజన్, ఏప్రిల్ నెల వరి పంట కోసి ఆరబెట్టారు. రెండు రోజుల తర్వాత ఆకస్మాత్తుగా అకాల వర్షం పోటెత్తింది. ఆరుగాలం దుక్కి దున్ని పండించిన పంట వర్షము నీటిలో కొట్టుకు పోయింది. ఊరిలోని రైతుల హాహాకారాలతో నిండిపోయింది. ప్రభుత్వం ఈ అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఆ నష్ట పరిహారం వాళ్ళని కుదుటపడేలా చేయలేదు. సుభాష్ వాళ్ళ నాన్న ఆ పంట నష్టాన్ని చూసి వెక్కి వెక్కి ఏడ్చి మతిస్థిమితం లేని వాడిగా మారిపోయాడు. సుభాష్ కుటుంబం వాళ్ల నాన్నను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నారు.

ప్రతి ఊరిలో మతిస్థిమితం లేని వారిని చాలామందిని చూసి జాలి పడేవాడు. వీరికి బాగు చేసే ఉపాయం ఏమీ లేదా అని తనలో తానే మదనపడుతూ అప్పుడప్పుడు స్నేహితులతో దానికి సంబంధించిన విషయాలు పంచుకునే వాడు. అప్పుడప్పుడు స్నేహితులు వారించినా మతిస్థిమితం లేని వారితో మాట్లాడాలని ప్రయత్నిస్తూ ఉండేవాడు. కొంతమంది సుభాష్‌ను పిచ్చిపిచ్చి చేష్టలతో కొట్టడానికి కూడా వచ్చేవారు.

సుభాష్‌ది ఇంటర్ అయిపోయింది. నీట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. మంచి ర్యాంక్ కొట్టి మంచి కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సంపాదించాడు. మానసిక వైద్యుడు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. స్నేహితులు కూడా కొంతమంది హార్టికల్చర్ మరి కొంతమంది అగ్రికల్చర్, ఇంకొందరు వెటర్నరీ ఎంచుకున్నారు. సుభాష్ సెలవుల్లో మతిస్థిమితం లేని వాళ్లతోనే ఎక్కువ సమయం గడిపేవాడు. వీరి కోసం ఏదైనా చేయాలని చాలా ప్రయత్నాలు చేసేవాడు.

వీరు మానసిక రోగిగా మారడానికి దారి తీసిన పరిస్థితులను

వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంటూ ఉండేవాడు.

భారతదేశంలో మానసిక వైద్యులు, మానసిక వైద్యాలయాల లేమి ఉన్నందున వీటి ఏర్పాటు ఆవశ్యకతను గ్రహించాడు. అప్పుడప్పుడు మానసిక స్థితి సరిగ్గా లేని వారి కుటుంబ సభ్యులకు కలుస్తూ ఉండేవాడు.

మానసిక రుగ్మత (Mental disorder - మానసిక వైకల్యం, Mental illness - మానసిక అనారోగ్యం) అనగా మనస్సుకు సంబంధించిన ఒక అనారోగ్యం. మానసిక రుగ్మతతో ఉన్న ప్రజలు వింతగా ప్రవర్తిస్తారు, లేదా ఇతరుల దృష్టిలో వీరు వింత ఆలోచనలను కలిగి ఉన్న వారుగా వుంటారు. మానసిక అనారోగ్యం వ్యక్తి జీవితకాలంలో పెరుగుతుండవచ్చు లేదా తగ్గుతుండవచ్చు. ఇది జన్యువులతో, అనుభవంతో ముడిపడి ఉండవచ్చు. మొత్తం మీద మానసిక రుగ్మత మారుతూ ఉంటుందని భావించాలి.

ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతూనే ఉంది. మానసిక రుగ్మతతో ప్రపంచవ్యాప్తంగా 264 మిలియన్ల మంది ప్రజలు బాధపడుతున్నారు. పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలు దీని బారిన పడుతున్నారు. నిరాశ, నిస్పృహ, బాధ, ఆనందం కోల్పోవడం, ఆత్మ విశ్వాసం కోల్పోవడం, నిద్ర లేమి, ఆకలి, అలసట, ఏకాగ్రత లేకపోవడం వంటివి ఈ మానసిక రుగ్మత కు కారణములు.

## లక్షణాలు

మానసిక రుగ్మత, మానసిక అనారోగ్యం అనేక రకాలుగా ఉండవచ్చు, అందరికి ఒకే లాగ ఉండవు. అయితే కొన్ని సాధారణ లక్షణాలను పరిశీలించవచ్చు. వాటిలో సరైన ఆహారం తీసుకోకపోవడం, నిద్ర లేమి లేదా ఎక్కువ నిద్ర, ఇష్టమైన కార్య కలాపాల నుండి దూరం చేయడం, శరీర నొప్పులు, ధూమపానం, మద్యపానం, మత్తు మందులు వాడటం, మతిమరుపు, చిరాకు, కోపం, ఆందోళన, విచారం లేదా భయం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో నిరంతరం పోరాటం, వాదించడం, మానసిక స్థితి, వెనుకటి ఆలోచనలను తలచుకోవడం, రోజువారీ కార్యకలాపాలు, పనులను నిర్వహించలేకపోవడం, మానసిక క్షోభ ఇవి అన్ని మానసిక రుగ్మత లక్షణాలుగా ఉదహరించవచ్చు.

## నిర్ధారణ - చికిత్స

మానసిక ఆరోగ్య రుగ్మతలకు చికిత్స ఒకటే సరిపోదు. ఇది నివారణను అందించదు. దీనికి వైద్యులు పలు రకాలుగా చికిత్స లక్షణాలను గమనించి, తగ్గించడం వంటివి చేస్తారు. మానసిక ఆరోగ్య రుగ్మతలకు చికిత్స చేయడానికి నాలుగు రకాలుగా విభజించి, ఈ మందులతో వైద్యం చేయడానికి ప్రయత్నిస్తుం టారు, అవి యాంటి డిప్రెసెంట్స్, యాంటీ-యాంగ్జైటీ మందులు, యాంటిసైకోటిక్ మందులు, మూడ్-స్టెబిలైజింగ్ మందులు.

వైద్యులు సైకోథెరపీ, ఆసుపత్రి, ఇంటిలో చికిత్స జీవనశైలి చికిత్స, మానసిక ఆరోగ్య చికిత్స లాంటివి మానసిక రుగ్మత బారిన పడిన వ్యక్తులకు చికిత్స చేస్తారు.

## భారత దేశంలో మానసిక రుగ్మత రోగులు

ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం, మానసిక ఆరోగ్యానికి మద్దతుగా ప్రయత్నాలను సమీకరించడం అనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) తెలిపిన నివేదిక ప్రకారం, భారతదేశంలో మానసిక ఆరోగ్య శక్తి అంతగా లేదని, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్యతో పోల్చితే దేశంలో మానసిక వైద్యులు, మనస్తత్వవేత్తల కొరత ఎక్కువగా ఉందని WHO పేర్కొంది. భారతదేశంలో (100,000 జనాభాకు) మనో రోగ వైద్యులు (0.3), నర్సులు (0.12), మనస్తత్వవేత్తలు (0.07), సామాజిక కార్యకర్తలు (0.07) ఉన్నారని WHO పేర్కొంది, అయితే కావాల్సిన సంఖ్య 100,000 జనాభాకు 3 మానసిక వైద్యులు, మనస్తత్వవేత్తల కంటే ఎక్కువ, 7.5 శాతం మంది భారతీయులు కొంత మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని WHO అంచనా వేసింది. ఈ సంవత్సరం చివరి నాటికి భారత దేశంలో సుమారు 20 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కలను చూస్తే 56 మిలియన్ల భారతీయులు నిరాశతో బాధపడుతున్నారు. 38 మిలియన్ల మంది భారతీయులు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారు. కొందరు ఈ మానసిక రోగానికి దెయ్యం పట్టింది. విరుగుడుగా భూతవైద్యులతో వైద్యం పేరుతో వారిని శారీరక హింసకు గురి చేస్తున్నారు.

కొంతకాలానికి మంచి మానసిక వైద్యాలయం ఏర్పాటు చేశాడు. తన సామాజిక బాధ్యతగా చాలామందికి ఉచితంగా సేవలు చేసి అనతి కాలంలోనే మానసిక రోగులను సాధారణ వ్యక్తులుగా మార్చి వేశాడు. వారి కుటుంబ సభ్యుల కళ్ళల్లో ఆనందం నింపాడు.




## గవర్నర్‌కు ఆ అధికారం లేదు

ఉన్నతాధికారులకు సమన్లు జారీ చేసే అధికారం గవర్నర్‌కు లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఉద్ఘాటించారు. ఈ మేరకు ఆయన కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్‌కు ఒక లేఖ రాశారు. రాజ్‌భవన్‌లో తనముందు హాజరు కావాల్సిందిగా డిమాండ్ చేస్తూ చీఫ్ సెక్రటరీకి, రాష్ట్ర పోలీసు చీఫ్‌కు గవర్నర్ జారీ చేసిన ఆదేశాలను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వార్తాపత్రికల్లో వచ్చిన 'కథనాల'ను ఆసరా చేసుకుని చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్, డిజిపి షేక్ దర్వేష్ సాహెబ్‌లకు గవర్నర్ నేరుగా సమన్లు జారీ చేశారు. గవర్నర్ చర్య పూర్తిగా అనుచితమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

## మారని స్వరూపానంద స్వామి తీరు

ద్వేషపూరిత ప్రసంగాల విషయంలో యూపీలో స్వామి రామ స్వరూపానందపై ఎఫ్ఐఆర్ దాఖలు అయినప్పటికీ ఆయన తీరులో మార్పు రాలేదు. తాజాగా ముస్లింలపై హింసకు ఆయన పిలుపునిచ్చాడు. గత నెల 14 నుంచి 18 మధ్య ఘజియాబాద్‌లోని ఒక ఫామ్‌హౌజ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముస్లింలకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టాలని ఈ కార్యక్రమానికి వచ్చిన భారీ జన సందోహాన్ని ఉద్దేశిస్తూ ఆయన అన్నట్టు ఆ వీడియోలో ఉన్నది.

## పేరు మారింది

మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లా పేరు మారిపోయింది. అహ్మద్ నగర్‌ను అహిల్యా నగర్‌గా మారుస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. దీంతో బీజేపీ పేర్ల వెనుక పడిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పేర్లపై పెడుతున్న ఆసక్తి ప్రజల సంక్షేమం మీద పెడితే బాగుంటుందని వెల్లడించాయి.

## జార్ఖండ్‌లో ఎన్నార్సీని అమలు చేస్తాం

జార్ఖండ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో రాజకీయం వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్నార్సీ)ను జార్ఖండ్‌లో అమలు చేస్తామని తెలిపారు. సీఎం హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం చొరబాటుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శివరాజ్ సింగ్ చౌహాన్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. జార్ఖండ్‌లో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేయనున్నట్లు తెలిపారు. 'రోటీ, మాటి ఔర్ బేటీ'ని రక్షించాలని తాము నిర్ణయించినట్లు చెప్పారు.

## గుజరాత్‌లో కొనసాగుతున్న బుల్డోజ్‌రాజ్

గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం తన విధ్వంసకర పాలన కొనసాగిస్తోంది. అక్రమ నిర్మాణాలుగా ముద్ర వేసి మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని సాగిస్తున్న కూల్చివేతలను తక్షణమే నిలిపివేయాలని ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను కూడా కాషాయ పార్టీ లెక్క చేయడం లేదు. ముస్లిం ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేస్తోంది. అనేక జనావాసాలను కూడా నేలమట్టం చేస్తోంది. గిర్ సోమనాథ్ జిల్లాలోని వెవరాల్ ప్రాంతంలో గత నెల 28న పిర్ షా సిలార్ దర్గాతోపాటు మరో ఎనిమిది మత కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇవన్నీ ముస్లింలకు చెందినవే. ఆ ప్రాంతంలో ముస్లింలు నివసిస్తున్న 37 ఇళ్లను కూడా నామరూపాలు లేకుండా చేశారు. కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అవన్నీ గత జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

## కశ్మీర్ లో కూటమి, హర్యానాలో బీజేపీ

జమ్ముకశ్మీర్‌ను ఇండియా కూటమి కైవసం చేసుకుంది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 (ఏ) రద్దు (పదేళ్ల) తరువాత జరిగిన మొదటి ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), కాంగ్రెస్, సిపిఎం పార్టీలతో కూడిన ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. నేషనల్ కాన్ఫరెన్స్ 42, కాంగ్రెస్ 6, సిపిఎం 1 స్థానాల్లో ఘన విజయం సొంతం చేసుకున్నాయి. దీంతో ఇండియా బ్లాక్ 49 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి కేవలం 29 సీట్లకు పరిమితమైంది. పిడిపి 3, ఆప్, జెపిసి పార్టీలు చెరొక స్థానంలో గెలుపొందాయి. ఇండిపెండెంట్లు ఏడుగురు విజయం సాధించారు. అటు హర్యానాలో బిజెపి గెలుపొందింది. వరుసగా మూడు సార్లు హర్యానాలో ఆ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంది. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు, సంస్థాగత బలోపేత లేమి ఆపార్టీ ఓటమికి కారణమయ్యాయి. ఈ ఫలితాలను అంగీకరించబోమని, ఇవిఎంలు ట్యాంపరింగ్ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అందుకు కారణం లేకపోలేదు. ఫలితాల లెక్కింపు ప్రారంభమై దాదాపు మూడు గంటల వరకు కాంగ్రెస్ దాదాపు 60 స్థానాల వరకు లీడింగ్‌లో ఉంది. ఆ తరువాత ఎన్నికల ఫలితాలు తారుమారయ్యాయి. ఒక్కసారిగా బిజెపి లీడింగ్ పెరిగింది. ఇలాంటి పరిణామం ఇటీవలి కాలంలో దాదాపుగా ఎప్పుడూ జరగలేదు.




## ఎన్నికలకు ముందు సంస్కరణలు అవసరం

బంగ్లాదేశ్‌లో ఎన్నికలు నిర్వహించడానికన్నా ముందు సంస్కరణలు తేవాల్సిన అవసరం వుందని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత ముహమ్మద్ యూనస్ స్పష్టం చేశారు. ప్రోథమ్ అలో వార్తాపత్రిక ఇంటర్వ్యూలో ఆయన పలు అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజాస్వామ్య సంస్థల పునరుద్ధరణ అత్యంత తీవ్రమైన, కష్టమైన సవాలుగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. "మాలో ఎవరూ కూడా సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగాలని అనుకోవడం లేదు." అని ఆయన స్పష్టం చేశారు. సంస్కరణలనేవి చాలా కీలకమైనవని ఆయన వ్యాఖ్యానించారు. మీరు ఎన్నికలు నిర్వహించాలని అన్నట్లైతే మేం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా వున్నాం. కానీ సంస్కరణల కన్నా ఎన్నికలు ముందు నిర్వహించడం తప్పు కాగలదని ఆయన అన్నారు.

## పశ్చిమాసియాలో దౌత్య వైఫల్యం సిగ్గుచేటు

పశ్చిమాసియాలో యుద్ధాన్ని, ఘర్షణలను పరిష్కరించడంలో ప్రపంచ దేశాలు విఫలమవడం సిగ్గుచేటైన వ్యవహారమని పోప్ ఫ్రాన్సిస్ విమర్శించారు. గాజాలో ఇజ్రాయిల్ దాడులకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏడాది క్రితం, విద్వేషం రగిలింది. సిగ్గుపడే రీతిలో అంతర్జాతీయ సమాజం వైఫల్యం కారణంగా అది హింసను చిమ్ముతోంది. ఈ విషాదానికి స్వస్తి పలకడంలో ప్రపంచ అగ్ర దేశాలు విఫలమయ్యాయి" అని ఆయన కేథలిక్కులకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

## ఇజ్రాయిల్ మూల్యం చెల్లించుకోక తప్పదు

గాజాలో నరమేథానికి ఇజ్రాయిల్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ పేర్కొన్నారు. పాలస్తీనా పౌరులు లక్ష్యంగా గాజాస్ట్రిప్‌లో యుద్ధోన్మాదంతో ఇజ్రాయిల్ దాడులను ప్రారంభించి ఈ నెల 7వ తేదీనాటికి ఏడాది మార్క్‌ను చేరుకున్న సంగతి తెలిసిందే. ఏడాదిగా కొనసాగిస్తున్న, ఇప్పటికీ కొనసాగుతున్న ఈ మారణహోమానికి ఇజ్రాయిల్ త్వరలో లేదా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సిందేనని మర్చిపోకూడదు అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూని హిట్లర్‌తో పోల్చడంతో పాటు ఆయనను 'గాజా కసాయి' అని పేర్కొన్నారు.

## గుటెరస్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు ఐరాస భద్రతా మండలి (యుఎన్‌ఎస్‌సి) తెలిపింది. పశ్చిమాసియా దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో..యుఎన్ సెక్రటరీ జనరల్ లేదా ఐరాసతో సంబంధం ఉండకూడదనే ఏ నిర్ణయమైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని 15 మంది సభ్యులతో కూడిన కమిటీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అయితే ఆ ప్రకటనలో ఇజ్రాయిల్ దేశం పేరును ప్రస్తావించలేదు. తమ దేశంలోకి ప్రవేశించకుండా ఆంటోనియో గుటెరస్‌పై నిషేధం విధిస్తున్నట్లు ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణుల దాడిని యుఎస్ సెక్రటరీ జనరల్ ఖండించలేదని ఆయన ఆరోపించారు.

## మాపై దాడి చేస్తే ప్రతీకార దాడులు తప్పవు

ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పాలస్తీనా, లెబనాన్‌లపై వైమానిక దాడులతో విరుచుకు పడుతున్న ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరికలు చేసింది. ఇకపై ఇస్లామిక్ రిపబ్లిక్‌పై ఎలాంటి దాడులు జరగకూడదని, అలా జరిగితే ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు పాల్పడతామని హెచ్చరించింది. ఇరాన్ మౌలిక సదుపాయాలపై ఎలాంటి దాడి జరిగినా ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులు తప్పవని ఇరాన్ విదేశాంగ మంత్రి వార్నింగ్ ఇచ్చారు.

## ముయిజ్జు భారత్ పర్యటన

మాల్దీవుల అధ్యక్షుడు ముహమ్మద్ ముయిజ్జు ద్వైపాక్షిక చర్చల కోసం తొలిసారి భారత్‌లోకి అడుగుపెట్టారు. ఇంతకు ముందు జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముయిజ్జు హాజరయ్యారు. ఈసారి భారత్‌లో ఐదు రోజులు పర్యటించారు ముయిజ్జు.. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ప్రధాని మోదీతో సమావేశం అయ్యారు. గతేడాది నవంబరులో ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్‌తో ఆ దేశ సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనా మద్దతుదారుగా పేరొందిన ముయిజ్జు.. తమ దేశంలోని భారత సైనికులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా న్యూఢిల్లీ బయలుదేరే ముందు బీబీసీతో మాట్లాడిన ముయిజ్జు.. ఆర్థిక సంక్షోభంలో ఉన్న మాల్దీవులకు భారత్ అండగా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

# శాశ్వత గృహం స్వర్గం

## ముహమ్మద్ వహీదుద్దీన్

**అబ్దుల్ రహమాన్** అనే వ్యక్తికి అరటి, ద్రాక్ష పళ్ళంటే చాలా ఇష్టం. ఉదయాన్నే ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ఆయనకు మార్గ మధ్యంలో బండి పైన మంచి అరటి, ద్రాక్ష పళ్ళు కనబడ్డాయి. ఆయన బండి ఆపి ఒక డజన్ అరటి పండ్లు, కిలో ద్రాక్ష పళ్ళు కొని తన పెద్ద కుమారునితో వాటిని ఇంటికి పంపించాడు. ఆయన తన పని మీద వెళ్ళిపోయాడు. తిరిగి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చాడు. కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుని భోజనం చేయడానికి కూర్చున్నాడు. ఆయన ముందు అన్ని వస్తువులు ఉన్నాయి. కాని తాను ఎంతో ఇష్టంగా కొని ఉదయం పంపిన అరటి, ద్రాక్ష పండ్లు మాత్రం లేవు. అరటి, ద్రాక్ష పండ్లు తీసుకు రాలేదేమిటి? అని భార్య సమీనాను అడిగాడు. దానికి ఆమె ఇంకెక్కడి అరటి, ద్రాక్ష పండ్లు కొన్ని పిల్లలు తిన్నారు, కొన్ని నేను తిన్నానని సమాధానం ఇచ్చింది. ఇక ఆశ్చర్యపోవడం ఆయన వంతయింది.

చూడ్డానికి ఇది చాలా చిన్న సంఘటనే. కాని కొన్ని సందర్భాల్లో కొన్ని చిన్న చిన్న సంఘటనలు కూడా మనిషిని మేల్కొలుపుతాయి. అతని హృదయ కవాటాలు తెరుస్తాయి.


ఆయన వెంటనే దస్తర్‌ఖాన్ మీద నుంచి లేచాడు. తన బీరువా తెరిచి కొన్ని నోట్ల కట్టలు తీసుకుని కారులో కూర్చొని బయటికి వెళ్ళిపోయాడు. కొంత మంది సేవకులను కూడా తన వెంట తీసుకెళ్ళాడు. నేరుగా అతను ప్లాట్లు అమ్మే వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. ఒక మంచి ప్లాటు కొనుగోలు చేశాడు. ఆ తరువాత ఒక గుత్తేదారును, ఇంజనీరును పిలిపించాడు. తాత్కాలికంగా ఒక మ్యాప్ గీయించాడు. ఉన్న స్థలంలో మస్జిద్ నిర్మించమని గుత్తేదారుకు బాధ్యతలు అప్పగించాడు. దానికి సంబంధించి భారీ మొత్తాన్ని ముట్టజెప్పాడు. రెండు మూడు గంటల్లో తవ్వకాలు ప్రారంభం కావాలని ఆదేశాలు జారీ చేశాడు. ఇదంతా ఆయన ఎంత తొందరగా చేస్తున్నాడంటే ఇక ఆయనకు సమయం లేదేమో, మగ్రిబ్ అజాన్ వరకే అతని జీవితం మిగిలి ఉందేమో అన్నట్లు చేస్తున్నాడు. ఇలాంటి నిర్మాణ పనులకు నెలలు, సంవత్సరాలు పడతాయి. కాని మనస్సులో చిత్తశుద్ధి ఉంటే, మనిషి పిసినారి కాకపోతే నెలల పని కూడా క్షణాల్లో జరిగి పోతుంది. చిత్తశుద్ధి, ఆసక్తి కొన్ని గంటల్లో ఆయనతో అన్ని పనులు చేయించింది. మంచి ప్లాట్ దొరికింది. మంచి ఇంజనీర్ దొరికాడు, మంచి గుత్తేదారు దొరికాడు.

మగ్రిబ్ అజాన్‌కు ముందే తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మస్జిద్ నిర్మాణం మొదలయింది. సాయంత్రం ఆయన తిరిగి ఇంటికి వెళ్ళాడు. సతీమణి సమీనా ఆయన్ను మధ్యాహ్నం భోజనం చేయకుండా ఎక్కడి వెళ్ళారు అని అడిగింది. అందుకు ఆయన 'నా అసలైన గృహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి వెళ్ళాను. అక్కడ అన్నపానీయాలు ఏర్పాటు చేసుకోడానికి వెళ్ళాను, అల్లాహ్ దయ వల్ల అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఇక నేను ప్రశాంతంగా చనిపోవచ్చు. మీరు నా జీవితంలోనే నా కోసం రెండు అరటి పండ్లు, నాలుగు ద్రాక్ష పళ్ళు ఉంచలేకపోయారు. నేను మీ కోసం అన్నీ వదలిపెట్టి వెళ్ళేవాడిని. అందుకని నేను స్వయంగా నా ధనంలో కొంత భాగాన్ని నా కోసం ముందుగానే పంపుకున్నాను. నా మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంది' అన్నాడు.

సమీనా ఈ విషయాన్ని గ్రహించింది. జరిగిన తప్పును తెలుసుకున్నది. అల్లాహ్‌తో దుఆ చేస్తూ సజ్దా చేసింది.

ఆలోచించేవారికి ఇందులో ఎంతో గుణపాఠం ఉంది.

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**